


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 9 సంచిక : 282 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : కాకినాడ | సోమవారం 15 జూన్ 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE :282 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : KAKINADA | MON 15 JUNE 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## మా ఫేస్‌బుక్ పేజీని బ్లాక్ చేశారు... కూటమి ప్రభుత్వంపై జగన్ ఆగ్రహం

- సోషల్ మీడియాలో కనిపించని వైసీపీ అధికారిక ఫేస్‌బుక్ పేజీ
- చంద్రబాబు ప్రభుత్వంపై జగన్ తీవ్ర ఆరోపణలు
- ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్నందుకే ఈ చర్యలన్న జగన్
- పేజీని వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్
- న్యాయపరంగా పోరాడతామని స్పష్టీకరణ



**పెన్ పవర్ డెస్క్:**వైసీపీ అధినేత జగన్ ఏపీ కూటమి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తమ పార్టీ అధికారిక ఫేస్‌బుక్ పేజీని భారతదేశంలో కనిపించకుండా చేశారని, ఇది ప్రతిపక్షాల గొంతు నొక్కే చర్యేనని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను, అవినీతిని ప్రశ్నిస్తున్నందుకే కక్షపూరితంగా ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఈ ఏడాది ప్రారంభంలో తమ పార్టీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను తొలగించారని, ఇప్పుడు ఫేస్‌బుక్ పేజీని లక్ష్యంగా చేసుకున్నారని జగన్ ఒక ప్రకటనలో తెలిపారు. “ఇది కేవలం వైసీపీపై జరిగిన దాడి కాదు. ప్రజాస్వామ్య విలువలు, భావప్రకటనా స్వేచ్ఛపై జరిగిన దాడి” అని ఆయన పేర్కొన్నారు. ఇలా ప్రతిపక్ష పార్టీ అధికారిక ఖాతాలను నిలిపివేయడం ప్రమాదకరమని, ఇది పూర్తిగా అప్రజాస్వామికమని అన్నారు. అమరావతి రాజధాని ఖర్చులు, డీఎస్సీ ప్రక్రియలో అవకతవకలు, టీటీడీ నెయ్యి టెండర్లు వంటి అంశాలపై ఆధారాలతో సహా అవినీతిని బయటపెడుతుండటంతోనే ప్రభుత్వం ఇలాంట

- మిగతా 2లో



## పల్నాడు జిల్లాలో విషాద ఘటన... కృష్ణా నదిలో పడవ బోల్తా పడి నలుగురి మృతి

- పల్నాడు జిల్లాలో ఘోర పడవ ప్రమాదం
- బంధువుల ఇంటి వేడుకకు వెళ్లి తిరిగొస్తుండగా ఘటన
- పడవలో ఉన్న 10 మందిలో ఇద్దరు మృతి, ఇద్దరు గల్లంతు
- ఆరుగురిని సురక్షితంగా కాపాడిన స్థానికులు
- గల్లంతైన వారి కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలు

**పెన్ పవర్ డెస్క్:**ఏపీలోని పల్నాడు జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. అచ్చంపేట మండలం, కోనూరు గ్రామం వద్ద కృష్ణా నదిలో ఓ పడవ బోల్తా పడిన ఘటనలో నలుగురు మృతి చెందారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులు ఉన్నారు. వివరాల్లోకి వెళితే, కోనూరు గ్రామంలోని కుంకలగుంట గంగయ్య అనే వ్యక్తి ఇంటికి బంధువులు వేడుక కోసం వచ్చారు. అనంతరం, సరదాగా గడిపేందుకు 10 మంది కలిసి ఒక చిన్న పడవలో నదిలో షికారుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో పడవ అదుపుతప్పి ఒక్కసారిగా బోల్తా పడింది. దీంతో పడవలో ఉన్నవారంతా నీటిలో మునిగిపోయారు.ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. వారు ఆరుగురిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చగలిగారు.

- మిగతా 2లో

## ఏపీకి వర్ష సూచన.. పలు జిల్లాలకు హెచ్చరిక

- దక్షిణ కోస్తాంధ్ర నుంచి తమిళనాడు వరకు విస్తరించిన అల్పపీడనం
- ఏపీలోని పలు జిల్లాలకు వర్ష సూచన జారీ
- కొన్ని జిల్లాల్లో ఉరుములతో కూడిన మోస్తరు వర్షాలు
- మరికొన్ని చోట్ల తేలికపాటి జల్లులు పడే అవకాశం
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన



- మిగతా 2లో




## మహారాష్ట్రలో ఘోర ప్రమాదం... పికప్ వ్యాన్ బావిలో పడి 8 మంది మృతి

- మహారాష్ట్రలోని షోలాపూర్ జిల్లాలో ఘోర ప్రమాదం
- ప్రయాణికులతో వెళ్తున్న పికప్ వ్యాన్ అదుపుతప్పి బావిలో పడిన వైనం
- ఈ దుర్ఘటనలో 8 మంది అక్కడికక్కడే మృతి
- ఘటనా స్థలంలో సహాయక చర్యలు
- ప్రమాదానికి గల కారణాలపై పోలీసుల దర్యాప్తు



**పెన్ పవర్ డెస్క్:**మహారాష్ట్రలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. షోలాపూర్ జిల్లాలో ప్రయాణికులతో వెళ్తున్న ఓ పికప్ వ్యాన్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న బావిలో పడిపోయింది. ఈ దుర్ఘటనలో 8 మంది మృతి చెందినట్లు పోలీసులు ఆదివారం వెల్లడించారు. మృతుల్లో నలుగురు మహిళలు, నలుగురు చిన్నారులు ఉన్నారు. పోలీసులు అందించిన ప్రాథమిక వివరాల ప్రకారం, మృతులంతా పండరీపూర్ తాలూకా రంజని గ్రామానికి చెందిన సాగర్ చౌగులే కుటుంబ సభ్యులు, బంధువులుగా

- మిగతా 2లో



## ఫ్రాన్స్‌లో మోదీ పర్యటన.. మేక్రాన్‌తో కలిసి చారిత్రక ‘విల్లా కెర్లియోస్’ సందర్శన

- ఫ్రాన్స్‌లోని నీస్ నగరంలో పర్యటిస్తున్న ప్రధాని మోదీ
- ‘భారత్ ఇన్నోవేట్స్’ కార్యక్రమాన్ని ప్రారంభించిన మోదీ, మేక్రాన్
- దేశంలో స్టార్టప్ వ్యవస్థ మరింత విస్తరిస్తుందన్న మోదీ
- ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు జరపనున్న నేతలు

**పెన్ పవర్ డెస్క్:**ప్రధాని నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఆదివారం ఫ్రాన్స్‌లోని నీస్ నగరంలో ఉన్న చారిత్రక ‘విల్లా కెర్లియోస్’ను సందర్శించారు. ఈ సందర్భంగా ఇద్దరు

- మిగతా 2లో

## గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు మద్దతు.. సీఎం చంద్రబాబుకు రిటైర్డ్ ఇంజనీర్ల లేఖ

- గోదావరి వరద జలాలపై ఏపీకి సంపూర్ణ హక్కులున్నాయన్న రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం
- గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుకు మద్దతుగా సీఎం చంద్రబాబుకు లేఖ
- ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం మిగులు జలాలను వాడుకునే స్వేచ్ఛ ఏపీకి ఉందని వెల్లడి

- మిగతా 2లో



## కేసీఆర్ ప్రతి సంక్షేమ పథకం వెనక ఓ విజన్



**పెన్ పవర్ డెస్క్:** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ తీసుకొచ్చిన ప్రతి సంక్షేమ పథకం వెనక ఓ విజన్ ఉందని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. ఆదివారం (జూన్ 14) హరీష్ రావు హనుమకొండ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పోవాలే కేసీఆర్ రావాలని జనం అంటున్నారని అన్నారు. సమాజంలో సామాజిక రుగ్మతలను దూరం చేసిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. చట్టాలు, పోలీసులు చేయలేని పనిని కళ్యాణలక్ష్మితో కేసీఆర్ చేశారని.. కళ్యాణ లక్ష్మీతో బాల్య వివాహాలు ఆగిపోయాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ దుర్మార్గాలపై రెండున్నర ఏళ్లుగా అవిశ్రాంతంగా కొట్లాడుతున్నామని అన్నారు. కార్యకర్తల అండదండలతోనే హైడ్రాలాంటి అరాచకాలపై పోరాడుతున్నామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ఇప్పటినుంచే పార్టీ గెలుపు కోసం పని చేయాలని.. తెలంగాణలో మళ్లీ ఎగిరేది గులాబీ జెండానేని అన్నారు.

ఎడిటర్ వ్యూ

# ఒప్పందం కుదిరేనా?

ఇరాన్–అమెరికా యుద్ధాన్ని ముగించే ఒప్పందం గతంలో కంటే ఇప్పుడు మరింత దగ్గరగా వచ్చిందని పాకిస్థాన్ శనివారం తెలిపింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఈ ఒప్పందం "రేపే సంతకం అవుతుంది" అని పేర్కొన్నారు. అయితే ఇరాన్ మాత్రం సానుకూల సంకేతాలు ఇస్తూనే, తుది నిర్ణయానికి ఇంకొంత సమయం అవసరమని స్పష్టం చేసింది.ఒప్పందం కుదిరిన వెంటనే హోర్ముజ్ జలసంధి తిరిగి తెరుచుకుంటుందని ట్రంప్ చెప్పారు.పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మాట్లాడుతూ, మరో 24 గంటల్లో ఒప్పందం ఖరారు కావచ్చని తెలిపారు. రెండు పక్షాలు ఎలక్ట్రానిక్ విధానంలో సంతకాలు చేసే అవకాశం ఉందన్నారు. ఆదివారం సంతకాల కార్యక్రమం ఉండేలా ప్రణాళిక రూపొందించినట్లు పాకిస్థాన్ విదేశాంగ శాఖ వెల్లడించింది.

**ఏప్రిల్ 7 నుంచి...**

అయితే ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి రాష్ట్ర మీడియాతో మాట్లాడుతూ, "ఒప్పందం రేపు కుదరదు. కానీ వచ్చే కొద్ది రోజుల్లో అవగాహన పత్రం ఖరారయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి" అన్నారు.ఏప్రిల్ 7 నుంచి అమల్లో ఉన్న కాల్పుల విరమణ కొనసాగుతోంది. గత కొన్ని వారాలుగా ఒప్పందం తుది దశకు చేరిందని ట్రంప్ పలుమార్లు ప్రకటించారు.అమెరికాతో గత ఏడాది, ఈ ఏడాది ఆరంభంలో జరిగిన చర్చల తర్వాత అమెరికా, ఇజ్రాయెల్ దాడులు జరిగాయని గుర్తుచేస్తూ ఇరాన్ అప్రమత్తంగా వ్యవహరిస్తోంది.

**హోర్ముజ్ జలసంధిలో మైన్ల తొలగింపుపై జీ7లో చర్చ...**

సోమవారం ప్రారంభమయ్యే జీ7 సదస్సులో హోర్ముజ్ జలసంధిలో పేలుడు మైన్ల తొలగింపు అంశంపై ట్రంప్ చర్చించనున్నారు.వైట్‌హౌస్ నిబంధనల మేరకు పేరు వెల్లడించని ఓ అమెరికా అధికారి తెలిపిన వివరాల ప్రకారం, ట్రంప్ జీ7 సమావేశం సందర్భంగా ఈజిప్ట్, ఖతర్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నాయకులతో భేటీ కానున్నారు. యుద్ధాన్ని పూర్తిగా నిలిపివేసే చర్యలపై చర్చిస్తారు.యుద్ధ విరామం కొనసాగితే మైన్ల తొలగింపు పనుల్లో సహకరించేందుకు బ్రిటన్, ఫ్రాన్స్ ఆసక్తి చూపాయి.యుద్ధం ప్రారంభమైన కొద్ది రోజులకే ఇరాన్ హోర్ముజ్ జలసంధిపై ప్రభావవంతమైన నియంత్రణ సాధించింది. దీంతో పర్షియన్ గల్ఫ్ నుంచి చమురు, సహజవాయు రవాణా దాదాపు నిలిచిపోయింది. దీనికి ప్రతిస్పందనగా అమెరికా ఇరాన్ నౌకాశ్రయాలపై దిగ్బంధం అమలు చేసింది.

**అణు కార్యక్రమం ఇంకా చిక్కుముడిగానే...**

ప్రస్తుతం చర్చలో ఉన్న అవగాహన పత్రం యుద్ధం ముగింపుకే పరిమితమని ఇరాన్ విదేశాంగ శాఖ తెలిపింది. "ఈ దశలో అణు అంశంపై ఎలాంటి చర్చ ఉండదు" అని బఘాయి చెప్పారు. ఇరాన్ అణు కార్యక్రమం, అధికంగా శుద్ధి చేసిన యురేనియం నిల్వలు చాలా కాలంగా అమెరికా, ఇజ్రాయెల్‌లతో విభేదాలకు కారణమవుతున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో కూడా ఇవి ఆందోళనకు దారితీశాయి. అయితే పరిస్థితులు సాధారణ స్థితికి చేరిన తర్వాత ఇరాన్‌లో గానీ, అమెరికాలో గానీ ఉన్న అధిక శుద్ధి యురేనియాన్ని తగ్గించి నాశనం చేస్తామని ట్రంప్ సామాజిక మాధ్యమాల్లో పేర్కొన్నారు.ఈ వారం ప్రారంభంలో ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్‌ల మధ్య జరిగిన పరస్పర దాడుల తర్వాత చర్చలు వేగం పుంజుకున్నాయి. అవి కాల్పుల విరమణను దెబ్బతీసి మళ్లీ మధ్యప్రాచ్యాన్ని పూర్తి స్థాయి యుద్ధంలోకి నెట్టే పరిస్థితి తీసుకొచ్చాయి.ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి శుక్రవారం ఎక్స్‌లో స్పందిస్తూ, "ఒప్పందం ఇంత దగ్గరగా ఎప్పుడూ రాలేదు" అని వ్యాఖ్యానించారు. మరోవైపు ట్రంప్ కూడా గురువారం గణనీయ పురోగతి సాధించామని చెప్పారు.

**జూలైలో ఖమేనీ అంత్యక్రియలు...**

యుద్ధం ప్రారంభ దాడిలో మరణించిన ఇరాన్ మాజీ అత్యున్నత నేత అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు జూలైలో నిర్వహించనున్నట్లు ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ తెలిపింది. షియా ముస్లింల సంతాప మాసమైన మొహర్రం సందర్భంగా జూలై 4 నుంచి 9 మధ్య అంత్యక్రియలు, ఖననం, నివాళి కార్యక్రమాలు జరుగుతాయి. ఖమేనీ వారసుడిగా ఆయన కుమారుడు మొజ్తబా ఖమేనీ బాధ్యతలు చేపట్టారు. ఆయన మరింత కఠిన వైఖరితో ఉంటారని భావిస్తున్నారు. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఆయన బహిరంగంగా కనిపించలేదు. మొదట టెహ్రాన్‌లో అంత్యక్రియలు నిర్వహించి, తర్వాత ప్రముఖ షియా మత గురువుల కేంద్రంగా ఉన్న ఖోమ్‌కు, అక్కడి నుంచి ఖమేనీ స్వస్థలం మష్హద్‌కు తరలిస్తారు. అక్కడి ఇమామ్ రెజా పవిత్ర స్థలంలో ఆయనను ఖననం చేయనున్నారు. 1989లో అయతుల్లా రుహొల్లా ఖొమేనీ మరణం తర్వాత ఇస్లామిక్ రిపబ్లిక్‌ను ఖమేనీ కొత్త దిశగా నడిపించారు. ఆయన పాలన ఖొమేనీ కంటే ఎక్కువ కాలం కొనసాగింది.షియా మత గురువుల వ్యవస్థను విస్తరించడమే కాకుండా, రివల్యూషనరీ గార్డ్స్‌ను దేశంలో అత్యంత శక్తివంతమైన సంస్థగా తీర్చిదిద్దారు. సైనిక, వ్యాపార రంగాల్లో భారీ ప్రభావం కలిగిన ఈ బలగాలు దేశ బాలిస్టిక్ క్షిపణి వ్యవస్థను కూడా పర్యవేక్షించాయి. యుద్ధ సమయంలో అమెరికా, ఇజ్రాయెల్ ప్రధాన లక్ష్యాల్లో ఈ వ్యవస్థ ఒకటిగా నిలిచింది.

# బాదంపప్పు బాగోతలు ఎపిసోడ్ -18
# వి.ఆర్‌ల వెనుక అసలు కథ ఏమిటి..?

- పోస్టింగ్‌ల రాజకీయాలపై కొత్త ప్రశ్నలు
- సాధారణ కుటుంబం నుంచి కీలక పోస్టింగ్‌ల దాకా...
- ఐదు సార్లు వి.ఆర్‌లోకి వెళ్లిన అధికారి కథ ఏమిటి?
- కర్త కర్మ క్రియగా మామ "జీ "
- అవినీతి బినామీగా ఉన్న సత్తిపండు ఎవరు..?
- పెనుమంట్ర - తాడేపల్లిగూడెం అనుబంధంపై ఎందుకంత చర్చ?
- స్థానికంగా ప్రచారంలో ఉన్న లావాదేవీల కథనాలేమిటి?
- రిజిస్టర్డ్ ఆస్తులపై వినిపిస్తున్న ప్రశ్నలు ఏమిటి?
- ఆరోపణలకు సమాధానాలు ఎప్పుడు వస్తాయి?

ఒక సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన ఓ పోలీసు అధికారి ఉద్యోగ జీవితంలో పలుమార్లు వి.ఆర్‌లోకి వెళ్లడం, ఆ తర్వాత మళ్లీ కీలక పోస్టింగ్‌లు పొందడం ఇప్పుడు ఉమ్మడి గోదావరి జిల్లాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ పరిణామాల వెనుక కేవలం పరిపాలనా కారణాలే ఉన్నాయా? లేక ప్రభావవంతమైన వ్యక్తుల పాత్ర కూడా ఉందా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామం నుంచి ప్రారంభమైన ప్రయాణం, జగ్గంపేటలో విద్యాభ్యాసం, అనంతరం పోలీసు శాఖలో ఉద్యోగం, వివిధ ప్రాంతాల్లో పోస్టింగ్‌లు, వి.ఆర్‌లు, తిరిగి కీలక కేంద్రాల్లో బాధ్యతలు- ఈ మొత్తం వ్యవహారంపై స్థానికంగా అనేక చర్చలు సాగుతున్నాయి.

ఇన్వెస్టిగేషన్ నెట్వర్క్ పెన్ పవర్ , తాడేపల్లిగూడెం జూన్ 14 :

కుటుంబ నేపథ్యం గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామం... తండ్రి పాలవ్యాపారం, తల్లి గృహిణి అని సమాచారం... ఒక సాధారణ కుటుంబంలో జన్మించిన బాదంపప్పు.. డిగ్రీ వరకు అప్పటి తూర్పుగోదావరి జిల్లా ప్రస్తుత కాకినాడ జిల్లా మండల కేంద్రమైన జగ్గంపేట లో పూర్తి చేశాడని సమాచారం.. సర్వీస్ లోకి చేరేటప్పటికి (సర్వీస్ రికార్డు ప్రకారం) బాదం పప్పు స్థిర చరస్తులు ఎంత..? ప్రస్తుత ప్రాపర్టీ ఎంతో తెలిస్తే ముక్కున వేలేసుకోవాల్సిందే... ?
కర్త కర్మ క్రియగా మామ "జీ " వెనకుండి మన బాదంపప్పు ఆరోపణలు ఎదుర్కొని ఎప్పుడు దొరికిన... పై అధికారులను శాంతింపజేసీ అప్పటికి వి .ఆర్. కు పంపించుకోవడం, అనంతరం ఎమ్మెల్యేలకి రికమండేషన్ లెటర్ కోసం... ఎంతైనా వెచ్చించి బడా బాబుల్నే మీడియేటర్లు వాడి బాదం పప్పు కు మంచి సెంటర్ లోనే పోస్టింగు వేయించుకుంటాడని సమాచారం....
ఇకపోతే పెనుమంట్ర, తాడేపల్లిగూడెం లు మన బాదంపప్పుకు విడదీయరాని బంధం పెనవేసుకుంది... ఆ బంధం తెలియాలంటే పెనుమంట్ర మండలం ఆలమూరు గ్రామంలో సత్తిపండు ను టచ్ చేస్తే మొత్తం కథ తెలుస్తుందని, బాదంపప్పు కు సంబంధించిన ఏ లావాదేవీలు జరగాలన్న సత్తిపండు ఉండాల్సిందేనాని... బాదంపప్పు అవినీతి బినామీగా ఉన్న సత్తిపండు ప్రసిద్ధి చెందాడని సమాచారం... ఇప్పటికే పలుమార్లు స్టేషన్ కూడా వచ్చి వెళ్తుంటాడని ఆ స్టేషన్ కానిస్టేబుల్స్ అయిన త్రిమూర్తులు కూడా చెప్పుకోవడం కొసమెరుపు... ఆ కోణంలో తీగ లాగిన పెన్ పవర్ కు ఇప్పటికే రెండు ప్రాపర్టీస్ పెన్ పవర్ చేతికి చిక్కాయి... డొంక లాగే పనిలోనే ఉంది పెన్ పవర్ ఆ డొంక కదిలితే మిగతా అవినీతి చిట్టా అంతా బయటికి వస్తుంది..

**ఎపిసోడ్ 19లో**
**బాదంపప్పు గురించి మరిన్ని ఆసక్తి కథనాలు**
**ఆస్తులపై వినిపిస్తున్న ప్రశ్నలు...**
**పత్రాలు ఏమి చెబుతున్నాయి..?**

## ఫ్రాన్స్‌లో మోదీ పర్యటన.. మేక్రాన్‌తో కలిసి చారిత్రక 'విల్లా కెర్లియోస్' సందర్శన

- మొదటి పేజి తరువాయి

నేతలు తేలికపాటి సంభాషణలో మునిగిపోయారు. విల్లాను కలియతిరుగుతూ ఆత్మీయంగా మాట్లాడుకున్నారు.
విల్లా కెరిలోస్ అనేది 20వ శతాబ్దం ప్రారంభంలో నిర్మించిన ఒక అసాధారణమైన హౌస్ మ్యూజియం. క్రీస్తుపూర్వం 2వ శతాబ్దానికి చెందిన ఒక ప్రాచీన గ్రీకు ఉన్నత కుటుంబ నివాసాన్ని నమూనాగా తీసుకుని, ఎంతో నిశితంగా ఆధునిక కాలంలో దీన్ని పునఃసృష్టించారు. ఫ్రాన్స్‌లోని ఫ్రెంచ్ రివేరా తీరంలో, నైస్ మరియు మొనాకో నగరాల మధ్య ఉన్న బ్యూలీ-సర్-మెర్ అనే ప్రాంతంలో ఈ విల్లా ఉంది. మధ్యధరా సముద్రానికి అభిముఖంగా ఒక రాతి ద్వీపకల్పంపై కొలువై ఉన్న ఈ భవనం, ప్రస్తుతం చారిత్రక కట్టడంగా వర్గీకరించబడింది. దీని యాజమాన్య హక్కులను 'ఇన్‌స్టిట్యూట్ డి ఫ్రాన్స్' కలిగి ఉంది. అంతకుముందు, నీస్‌లో జరిగిన 'భారత్ ఇన్నోవేట్స్' కార్యక్రమాన్ని మోదీ, మేక్రాన్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. భారత్‌లో సంస్కరణల వేగం తగ్గబోదని స్పష్టం చేశారు. దేశంలోని స్టార్టప్ వ్యవస్థ మరింత విస్తరణకు సిద్ధంగా ఉందన్నారు. గత 11-12 ఏళ్లలో బలమైన ఆవిష్కరణల వ్యవస్థను నిర్మించుకున్నామని, ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా భారత్ అవతరించిందని గుర్తు చేశారు. ప్రపంచ సవాళ్లకు సాంకేతిక పరిష్కారాలు అభివృద్ధి చేసేందుకు తమతో కలిసి పనిచేయాలని ప్రపంచ ఆవిష్కర్తలను ఆయన ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరుకావడం ఫ్రాన్స్‌కు ఎంతో గౌరవకారణమని
అధ్యక్షుడు మేక్రాన్ అన్నారు. భారత నేతగా 12 ఏళ్లు పూర్తి చేసుకున్నందుకు మోదీని అభినందించారు. ఇరు దేశాల మధ్య సంబంధాలను
బలోపేతం చేయడంలో మోదీ పాత్రను ఆయన ప్రశంసించారు. అధ్యక్షుడు మేక్రాన్ ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ శనివారం ఫ్రాన్స్ చేరుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఇరు నేతలు ద్వైపాక్షిక సంబంధాలపై సమీక్ష జరపనున్నారు. ఈ కార్యక్రమానికి ముందు మోదీ పలువురు ఇన్వెస్టర్లు, వెంచర్ క్యాపిటల్ అధిపతులతో కూడా సమావేశమయ్యారు.

## మహారాష్ట్రలో ఘోర ప్రమాదం...
## పికప్ వ్యాన్ బావిలో పడి 8 మంది మృతి

- మొదటి పేజి తరువాయి

గుర్తించారు. వీరంతా మాల్వాడ్‌లోని ఆలయంలో దర్శనం పూర్తిచేసుకుని తిరిగి తమ స్వగ్రామానికి వెళుతుండగా మాల్వాడ్-పండరీపూర్ మార్గంలో ఈ విషాదం జరిగింది. తాండూల్వాడి సమీపంలోకి రాగానే వాహనం అదుపుతప్పి బావిలోకి దూసుకెళ్లింది.ప్రమాదం జరిగిన బావికి ఎలాంటి రక్షణ గోడ లేకపోవడమే ఇంతటి ఘోరానికి ప్రధాన కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై ఎన్‌సీపీ (శరద్ పవార్) ఎమ్మెల్యే రోహిత్ పవార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితుల కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే సహాయం అందించాలని డిమాండ్ చేశారు. జిల్లా పర్యవేక్షక మంత్రి జయకుమార్ గోర్ మాట్లాడుతూ.. బావికి రక్షణ గోడ లేకపోవడంపై విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. స్థానిక యంత్రాంగం సహాయక చర్యలను పర్యవేక్షిస్తోంది.

## మా ఫేస్‌బుక్ పేజీని బ్లాక్ చేశారు...
## కూటమి ప్రభుత్వంపై జగన్ ఆగ్రహం

- మొదటి పేజి తరువాయి

చర్యలకు దిగుతోందని జగన్ ఆరోపించారు. ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలపై న్యాయపరంగా, రాజ్యాంగబద్ధంగా పోరాడతామని ఆయన స్పష్టం చేశారు. బెదిరింపులు, సెన్సార్‌షిప్‌తో తమ గొంతును అణచివేయలేరని, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయడంలో వెనక్కి తగ్గేది లేదని తేల్చి చెప్పారు.ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడేందుకు, తమ ఫేస్‌బుక్ పేజీని తక్షణమే పునరుద్ధరించాలని జగన్ డిమాండ్ చేశారు.

## ఏపీకి వర్ష సూచన..
## పలు జిల్లాలకు హెచ్చరిక

దక్షిణ కోస్తాంధ్ర నుంచి తమిళనాడు వరకు అల్పపీడనం విస్తరించిందని, దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. సోమవారం పలు ప్రాంతాల్లో వర్షాలు పడతాయని ఆయన వెల్లడించారు.మన్యం, అల్లూరి, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, నంద్యాల, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు.
అదేవిధంగా శ్రీకాకుళం, పోలవరం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, గుంటూరు, బాపట్ల, చిత్తూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములతో కూడిన తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉందని వివరించారు.
వర్షాలు, పిడుగులతో కూడిన ఉరుముల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. చెట్ల కింద, భారీ హోర్డింగుల సమీపంలో నిలబడటం సురక్షితం కాదని హెచ్చరించారు.

## పల్నాడు జిల్లాలో విషాద ఘటన...
## కృష్ణా నదిలో పడవ బోల్తా పడి నలుగురి మృతి

- మొదటి పేజి తరువాయి

మిగిలిన నలుగురు గల్లంతు కాగా, సమాచారం అందుకున్న రెస్క్యూ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. గాలింపు చర్యల్లో నలుగురి మృతదేహాలను వెలికితీశారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు విచారణ చేపట్టారు.

## గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు మద్దతు..
## సీఎం చంద్రబాబుకు రిటైర్డ్ ఇంజనీర్ల లేఖ

గోదావరి నది వరద జలాలపై దిగువ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌కు పూర్తి హక్కులు ఉన్నాయని, ఆ నీటిని వినియోగించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు సమర్థనీయమని ఏపీ జలవనరుల శాఖ విశ్రాంత ఇంజనీర్ల సంఘం స్పష్టం చేసింది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు ఎం.విశ్వేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నరసింహమూర్తి నిన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు లేఖ రాశారు. గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్ (GWDT) 1978లో వెలువరించిన తీర్పును వారు తమ లేఖలో ప్రస్తావించారు. ఎగువ రాష్ట్రాలకు ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు పోగా, దిగువకు ప్రవహించే మిగులు వరద జలాలను వాడుకునేందుకు ఆంధ్రప్రదేశ్‌కు సంపూర్ణ స్వేచ్ఛ ఉందని వారు తెలిపారు. అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల చట్టం-1956 ప్రకారం, ఈ మిగులు జలాల వినియోగంపై కేంద్ర ప్రభుత్వం గానీ, ఎగువ రాష్ట్రాలు గానీ అభ్యంతరం తెలిపే అధికారం లేదని వారు తేల్చిచెప్పారు.
గోదావరి-బనకచర్ల అనుసంధాన పథకం ద్వారా వరద నీటిని బొల్లపల్లి రిజర్వాయర్‌లో నిల్వ చేసి, కరవు పీడిత ప్రాంతాలైన కర్నూలు, కడప, ప్రకాశం జిల్లాలకు 75 శాతానికి పైగా సాగునీటి భరోసా కల్పించవచ్చని సంఘం వివరించింది. ఈ ప్రాజెక్టు రాయలసీమ, కోస్తా ప్రాంతాల్లో వ్యవసాయం, తాగునీటి అవసరాలను తీర్చి, రాష్ట్ర ఆర్థిక స్థిరత్వానికి ఎంతో దోహదపడుతుందని పేర్కొంది.గోదావరి జలాల పంపకాలపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య చర్చలు, న్యాయపరమైన అంశాలు నడుస్తున్న తరుణంలో విశ్రాంత ఇంజనీర్ల సంఘం చేసిన ఈ ప్రకటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

## ఏడేళ్లకే కోడింగ్ లో దిట్ట...
## 16 ఏళ్లకే రూ.100 కోట్ల స్టార్టప్.. ఎవరీ ప్రాంజలి అవస్తి?

పెన్ పవర్ డెస్క్:అమెరికాలో భారత సంతతికి చెందిన ఓ యువతి చిన్న వయసులోనే అద్భుతం సృష్టించింది. కేవలం 16 ఏళ్ల వయసులో 'డెల్వ్.ఏఐ' పేరుతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్టార్టప్‌ను ప్రారంభించిన ప్రాంజలి అవస్థి, ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా వార్తల్లో నిలుస్తోంది. ఆమె స్థాపించిన కంపెనీ విలువ దాదాపు రూ. 100 కోట్లకు (12 మిలియన్ డాలర్లు) చేరడంతో ఆమె సక్సెస్ స్టోరీ సోషల్ మీడియాలో మరోసారి వైరల్ అవుతోంది.భారత్‌లో జన్మించిన ప్రాంజలి, చిన్నతనంలోనే తన కుటుంబంతో కలిసి ఫ్లోరిడాకు వలస వెళ్లింది. ఆమె తండ్రి ఇంజినీర్ కావడంతో, ఆయన స్ఫూర్తితో 7 ఏళ్లకే కోడింగ్ నేర్చుకోవడం ప్రారంభించింది. 13 ఏళ్ల వయసులో మెషిన్ లెర్నింగ్‌పై ఓ రీసెర్చ్ ఇంటర్న్‌షిప్‌లో పాల్గొంది. ఆ సమయంలో ఆన్‌లైన్‌లో ఉన్న భారీ సమాచారాన్ని విశ్లేషించడంలో పరిశోధకులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించింది.ఈ సమస్యకు పరిష్కారంగా, 2022 జనవరిలో, తన 16వ ఏట డెల్వ్.ఏఐని ప్రారంభించింది. ఆన్‌లైన్ సమాచారం, అకడమిక్ పేపర్లు, పీడీఎఫ్‌ల నుంచి కీలక విషయాలను వేగంగా వెలికితీసి, క్రమపద్ధతిలో అందించడమే ఈ ఏఐ టూల్ ప్రత్యేకత. మయామికి చెందిన ఓ స్టార్టప్ యాక్సిలరేటర్‌లో చేరడంతో ఆమెకు పెట్టుబడిదారులతో సంబంధాలు ఏర్పడ్డాయి. దీని ద్వారా ఆన్ డెక్, విలేజ్ గ్లోబల్ వంటి సంస్థల నుంచి సుమారు 450,000 డాలర్లు(దాదాపు రూ. 3.7 కోట్లు) నిధులను సమీకరించింది.గత కొన్ని రోజులుగా ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికలపై ఆమె విజయగాథ మళ్లీ ట్రెండ్ అవుతోంది. జార్జియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో కంప్యూటర్ సైన్స్ చదివిన ప్రాంజలి, ప్రస్తుతం ఇతర టెక్ ప్రాజెక్టులతోనూ చురుకుగా ఉన్నట్లు తెలుస్తోంది.

# అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

## ప్రేమ వ్యవహారమే కారణమా? పూర్తి విచారణ కోరుతున్న బంధువులు



**కాకినాడ రూరల్, పెన్ పవర్,జూన్ 14:** కాకినాడ రూరల్ మండల పరిధిలో ఓ యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం కలకలం రేపింది. ఈ ఘటనకు ప్రేమ వ్యవహారమే కారణమై ఉండవచ్చని స్థానికంగా ప్రచారం జరుగుతుండగా, మృతురాలి కుటుంబ సభ్యులు ఘటనపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని పోలీసులను కోరుతున్నారు.బంధువుల కథనం ప్రకారం, రౌతులపూడి మండలం గుమ్మరేగుల గ్రామానికి చెందిన వైరాల ప్రమీల (23) కాకినాడలో బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఉద్యోగం చేస్తోంది. ఆమె మరో ఇద్దరు యువతులతో కలిసి స్వామినగర్‌లోని ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నట్లు తెలిపారు.ఇంటి యజమాని కుమారుడు దుంగ భరత్ నందన్‌తో ప్రమీలకు పరిచయం ఉండేదని, ఇద్దరూ వివాహం చేసుకోవాలనే ఉద్దేశంతో ఉన్నట్లు మూడు నెలల క్రితం కుటుంబ సభ్యులకు తెలిపిందని బంధువులు పేర్కొన్నారు.శనివారం రాత్రి ప్రమీల ఉరేసుకుని మృతి చెందినట్లు అర్ధరాత్రి సమయంలో పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారని తెలిపారు. అయితే తాము అక్కడికి చేరుకునేలోపే మృతదేహాన్ని ఆసుపత్రి మార్చురీకి తరలించారని, ఘటనాస్థలంలో సామాన్లు చెల్లాచెదురుగా ఉండటం, మృతదేహం నేలపై ఉంచి ఉండటం వంటి అంశాలు అనుమానాలకు తావిస్తున్నాయని ఆరోపించారు.ఈ నేపథ్యంలో ఆదివారం మృతురాలి బంధువులు పెద్ద సంఖ్యలో కాకినాడ ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు జరిపి నిజానిజాలు వెలికితీయాలని డిమాండ్ చేశారు.పోలీసులు అనుమానితుడిగా భావిస్తున్న దుంగ భరత్ నందన్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. అయితే ఈ అంశంపై అధికారికంగా పోలీసులు ఇంకా పూర్తి వివరాలు వెల్లడించలేదు.మృతురాలి తండ్రి భీమవరంలో రిక్షా కార్మికుడిగా పనిచేస్తుండగా, తల్లి చెవిటి మరియు మూగ బాధితురాలని బంధువులు తెలిపారు.కుటుంబ సభ్యులు,బంధువులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

యువతి మృతికి సంబంధించిన కారణాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.అధికారిక విచారణ పూర్తయ్యే వరకు మృతికి గల ఖచ్చితమైన కారణాలపై నిర్ధారణకు రావడం సాధ్యం కాదు.

# పెన్ పవర్

కాకినాడ

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

## రామకృష్ణాపురం గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రారంభోత్సవానికి సిద్ధం.



**కిర్లంపూడి, పెన్ పవర్, జూన్, 14:** కిర్లంపూడి మండలం మండలం రామకృష్ణాపురం గ్రామంలో సుమారు 36 లక్షల రూపాయలతో విలేజ్ హెల్త్ క్లినిక్ పనులు చురుకుగా నిర్వహిస్తున్నారు.జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ చొరవతో మాజీ సర్పంచ్ కంతా సరస్వతి శ్రీను ఆధ్వర్యంలోచేపట్టారు. సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ రాజ్ శాఖ డిఇ ఉమాశంకర్, సిబ్బంది సిద్దు ఈ పనులను పర్యవేక్షించారన్నారు. త్వరలోనే ప్రారంబోత్సవానికి సిద్ధం చేస్తున్నామన్నారు.

## రాత్రికి రాత్రే సత్రం అనుకుని ఉన్న స్థలంలో అక్రమ నిర్మాణం....



**శంఖవరం పెన్ పవర్ జూన్ 14:-** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం లో శంఖవరం మండలం కత్తిపూడిలో శ్రీ రాజా వత్సవాయ జగపతి బహద్దరు మహారాణి బుచ్చి సీతయమ్మ దేవి వారి సత్రం సంబందించిన సర్వే నెంబర్ 63/11 లో గల 2.77 ఎకరాలు విస్తీర్ణం కలదు. సత్రం సంబందించిన స్థలంలో సత్రానికి అనుకుని ఉన్న డ్రైనేజీపై అక్రమ కట్టడాలు నిర్మాణం. శంఖవరం మండలం పాత వజ్రకూటం గ్రామం టీడీపికి చెందిన ఈ అక్రమ నిర్మాణానికి పూనుకున్నారు, ఇక్కడ చికెన్ షాప్ నిర్వహించుకునేందుకు రాత్రికి రాత్రే సత్రం అనుకుని ఉన్న స్థలంలో అక్రమ నిర్మాణం పూర్తి చేసారు. సత్రం సంబందించిన ఉద్యోగులు ఇక్కడ నిర్మాణం చేపట్టడానికి వీలులేదని చెప్పినా, పనులు మాత్రం ఆపలేదని వారు తెలియజేయడం జరిగింది. దీనిని గమనిస్తున్న ప్రజలు ఇక్కడ చికెన్ షాప్ పెడితే ఆ దారి గుండా వెళ్లే ప్రజలు, హైస్కూల్ కి వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడతారని చుట్టుపక్కల ప్రజలు తెలియజేశారు. ఈ అక్రమ నిర్మాణం ఎవరు ప్రోత్సాహంతో జరుగుతుందని అక్కడ ఉన్న వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. ఈ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేకచోట్ల ఈ అక్రమ నిర్మాణాలు జోరుగా జరుగుచున్నాయని ప్రజలు వాపోతున్నారు. దీనిపై సత్రం ఈవో రాపాక శ్రీనివాసరావు వారిని వివరణ కోరగా నా దృష్టికి నిన్ననే వచ్చిందని, నేను బాధ్యతలు చేపట్టి 13 రోజులు అవుతుందని, దీనిపై చైర్మన్ కి తెలియజేస్తానని, ఈ అక్రమ కట్టడాలు సత్రం ముఖద్వారం వద్ద పూర్తిగా డ్రైనేజీపై ఈ అక్రమ నిర్మాణం చేపట్టారని, ఈ స్థలం సత్రంలో భాగమేనని వారికి నోటీసులు జారీచేసి అక్రమ నిర్మాణ పనులు నిలిపివేయడం జరిగిందని, ఒకవేళ మళ్ళీ రాత్రికిరాత్రే పనులు చేపడితే ఉన్నత అధికారులను సంప్రదించి సత్రం అనుకుని ఉన్న అక్రమాలు అన్నీ తొలగిస్తామని తెలియజేయడం జరిగింది. కాని ఇక్కడ పూర్తిగా సత్రం చైర్మన్ కీ కొంతమొత్తములో డబ్బులు అందినట్లు సమాచారం. ఇంత బహిరంగా వేరొక గ్రామానికి చెందిన వ్యక్తి షెడ్డు నిర్మాణం చేపడుతున్న చూసి చూడనట్లు వ్యవరించడం అధికారులు వారికి పూర్తిగా సహకారం అందిస్తున్నారనే చెప్పవచ్చు. ఈ.ఓ పనులు ఆపమని చెప్పామన్న మళ్ళీ యధావిధిగా షెడ్డు పనులు చేపట్టంతో పలు అనుమానాలకు తావిస్తుంది. సంబంధిత ఉన్నత అధికారులు దృష్టి పెట్టి ఈ అక్రమ కట్టడాలు నిర్మూలించకపోతే సత్రం భూములు అక్రమార్కులు చేతులోకి వెళ్ళిపోతాయానేది వాస్తవం.



## శారీరక దృఢత్వానికి, మానసిక ఆరోగ్యానికి వ్యాయామం ఎంతోగానో దోహదం.

-సైకిల్ ర్యాలీ కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎస్సై,లక్ష్మీకాంతం



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, జూన్ 14:** శారీరక దృఢత్వానికి, మానసిక ఆరోగ్యానికి వ్యాయామం ఎంతగానో దోహదం చేస్తుందని ప్రత్తిపాడు ఎస్ఐ, ఎస్ లక్ష్మీకాంతం అన్నారు.

ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఎస్పీ,జి బిందుమాధవ్ ఉత్తర్వులతో,పెద్దాపురం డిఎస్పీ,ఏబీజీ తిలక్ ఆదేశాలతో సిఐ,బిఎస్ అప్పారావు సూచనలతో ప్రత్తిపాడులో ఎస్సై, లక్ష్మీకాంతం ఆధ్వర్యంలో నిర్వహించిన సైకిల్ ర్యాలీలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ కిర్లంపూడి రోడ్ శివారు వరకు కొనసాగింది.ఈ సందర్భంగా ఎస్సై లక్ష్మీకాంతం మాట్లాడుతూ ఆరోగ్యకర జీవనశైలికి నిత్య వ్యాయామం ఎంతో అవసరమన్నారు.ప్రతి ఒక్కరూ సైక్లింగ్,నడక వంటి శారీరక శ్రమకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.వ్యాయామం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చన్నారు.యువత ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు.ఫిట్ ఇండియా లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడమే ప్రధాన ఉద్దేశమన్నారు.ఈ సందర్భంగా "డ్రగ్స్ వద్దు బ్రో-సైకిల్ తొక్కు బ్రో" అంటూ ఎస్సై లక్ష్మీకాంతం యువతకు సందేశమిచ్చారు.చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు.యువత క్రీడలు, వ్యాయామంపై ఆసక్తి పెంచుకోవాలని కోరారు.అనంతరం ఎస్సై లక్ష్మీకాంతం పోలీసు సిబ్బందితో కలిసి సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి స్థానికుల నుంచి మంచి స్పందన లభించింది.

## వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అంకుటిత దీక్షతో పనిచేయాలి.

-ప్రత్తిపాడు వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు.





**కిర్లంపూడి, పెన్ పవర్, జూన్ 14:** నియోజకవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, నాయకులు కార్యకర్తలు అంకుటిత దీక్షతో పనిచేయాలని ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ముద్రగడ గిరిబాబు పిలుపునిచ్చారు.ఆదివారం కిర్లంపూడిలోని ముద్రగడ నివాసంలో ప్రత్తిపాడు మండలం పోతులూరు, గజ్జనపూడి గ్రామాల నుండి సుమారు 60 మంది యువ వైసీపీ కార్యకర్తలు,పార్టీ శ్రేణులు వైసీపీ సీనియర్ నాయకులు శెట్టి సత్తిబాబు ఆధ్వర్యంలో ముద్రగడ గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ముద్రగడ గిరిబాబు మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సైనికుడిలా కృషి చేయాలన్నారు.పార్టీకి మీలాంటి యువకులే అసలైన బలం, భవిష్యత్తు. యువకులంతా ఒక తాటిపై నడిచి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును, మంచిని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని అయన సూచించారు.ఈ కార్యక్రమంలో రెండు గ్రామాల నుండి యువకులు,వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

01

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

క్లాసీఫైడ్ యాడ్స్

కేవలం

యాడ్ 100/-కే

' ఐదు రోజులకు '

'4 సెం.మీ 4 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి

## తొమ్మిది రోజులు గడుస్తున్నా ఆచూకీ తెలియని చిన్నారి జ్ఞానేశ్వరి మిస్సింగ్ మిస్టరీ





- సాంకేతిక పరిజ్ఞానంతో అడివి జల్లెడ పడుతున్న అధికారులు
- చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆరా
- కాకినాడ జిల్లా ఎస్పీతో ఫోన్లో మాట్లాడిన ఉప ముఖ్యమంత్రి
- ఆచూకీ కనిపెట్టేందుకు చేపట్టిన చర్యలపై చర్చ

**కాకినాడ, బ్యూరో (తుని) పెన్ పవర్, జూన్, 14**

కాకినాడ జిల్లా, తుని మండల పరిధిలోని సీహెచ్ అగ్రహారంలో అదృశ్యమైన చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీ త్వరితగతిన కనుగొనేందుకు మరిన్ని బృందాలను రంగంలోకి దించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ సూచించారు. ప్రస్తుతం గాలింపు చర్యల్లో పాల్గొంటున్న పోలీసు, ఎస్డీఆర్ఎఫ్ బృందాలతోపాటు ఎన్డీఆర్ఎఫ్ బృందాల సేవలు కూడా వినిగియోగించుకోవాలని తెలిపారు. దట్టమైన అడవుల్లోకి సైతం వెళ్లగలిగే అటవీశాఖ నైట్ వాచర్స్, బేస్ క్యాంప్ వాచర్స్ , ఎక్స్ పర్ట్స్ సహాయం తీసుకుని పరిసర అటవీ ప్రాంతాల్లో జల్లెడ పట్టాలని చెప్పారు. చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం ఘటనపై శనివారం మరోసారి కాకినాడ జిల్లా ఎస్పీతో ఫోన్ లో సమీక్షించారు. ఇప్పటికే పలుమార్లు ఈ అంశంపై పోలీసు ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి మాట్లాడారు. బాలిక ఆచూకి కనుగొనేందుకు ఇప్పటికే 400 మందికిపైగా సిబ్బంది గాలింపు చర్యల్లో పాల్గొంటున్నట్టు, అత్యాధునిక డ్రోన్లతో అణువణువు జల్లెడ పడుతున్నట్టు కాకినాడ ఎస్పీ వివరించారు. చిన్నారి ఇంటి పరిసరాల్లో 38 సీసీ కెమెరాల్లో ఫుటేజీని పరిశీలించినట్టు తెలిపారు. చిన్నారి అదృశ్యమై నేటికీ తొమ్మిది రోజులు గడచిన క్రమంలో దర్యాప్తు మరింత వేగవంతం చేయాలని ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ ఆదేశించారు.

## వైద్య ఖర్చుల భారంతో ఇబ్బంది పడ్డ ఎవరైనా సీఎంఆర్ఎఫ్ కు దరఖాస్తు చేసుకోవచ్చు

- టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్



**జగ్గంపేట, పెన్ పవర్, జూన్ 14:** జగ్గంపేట రావులమ్మ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ఆదివారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన 22 మంది లబ్ధిదారులకు రూ.6,90,766 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షులు, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల టీడీపీ అధ్యక్షులు జీను మణిబాబు మాట్లాడుతూ జగ్గంపేట నియోజకవర్గంలో వైద్యం చేయించుకుని ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్న పేదలకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి నిధులు మంజూరయ్యాయని తెలియజేశారు. వైద్య ఖర్చుల భారంతో ఇబ్బంది పడుతున్న వారు ఎవరైనా సరే సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని మణిబాబు పేర్కొన్నారు. అర్హుల దరఖాస్తులను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కార్యాలయంలో స్వీకరిస్తామని, వెంటనే ప్రభుత్వానికి పంపి సాయం అందేలా చూస్తామని స్పష్టం చేశాడు. అనారోగ్యంతో కుంగిపోయిన పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ పెద్ద ఊరటనిస్తోందని, ప్రభుత్వ సాయాన్ని సకాలంలో అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీరంరెడ్డి కాశిబాబు, రేఖ బుల్లి రాజు, పాండ్రంగి రాంబాబు, మండపాక అప్పన్న దొర, పీలా మహేష్, నండ్ల చిరంజీవి, పోతాబత్తుల శ్రీను, గల్లా శ్రీను, భవన పోసియ్యా , కరణం బోరయ్య, తదితరులు పాల్గొన్నారు.

## జగ్గంపేటలో పోలీసుల సైకిల్ ర్యాలీ

- హాజరైన జగ్గంపేట ఎమ్మెల్యే నెహ్రూ




**జగ్గంపేట, పెన్ పవర్, జూన్ 14:** జగ్గంపేటలో ఆదివారం జగ్గంపేట సిఐ బి.తిరుపతిరావు ఆధ్వర్యంలో జగ్గంపేట పోలీస్ స్టేషన్ వద్ద నుంచి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి ముఖ్యఅతిథిగా జగ్గంపేట ఎమ్మెల్యే, టిటిడి బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ హాజరై సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జగ్గంపేట సిఐ తిరుపతిరావు, జగ్గంపేట ఎస్సై రఘునాథరావు, గండేపల్లి ఎస్ఐ శివ నాగబాబు, కిర్లంపూడి ఎస్ఐ సతీష్ కుమార్ వారి సిబ్బందితో సైకిల్ ర్యాలీ ద్వారా జగ్గంపేటలోని మెయిన్ రోడ్ , గ్రామాలగుండా పర్యటించారు. ఫిట్ ఇండియా సైకిల్ ర్యాలీ ద్వారా ప్రజలకు ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, మరియు శారీరక దృఢత్వంపై అవగాహన కల్పించారు.

## ట్రిపుల్ ఐటిల్లో 5 సీట్లు సాధించిన శంఖవరం ఏపి మోడల్ స్కూలు విద్యార్థులు...




**శంఖవరం పెన్ పవర్ జూన్ 14:**-కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం మండల కేంద్రం శంఖవరంలోని ఏపి మోడల్
స్కూలుకు చెందిన 5గురు విధ్యార్థులు త్రిపుల్ ఐటిల్లో సీట్లు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఏ వీరరాజు తెలిపారు. రాష్ట్రంలోని ఏపి మోడల్ స్కూళ్ళలోనే అత్యధికంగా 594 మార్కులు సాధించిన ఎస్ స్వాతి, ఇ దేవకి 581 మార్కులు, వై అపర్ణదేవి 581 మార్కులు, జి గౌతమి శరణ్య 577 మార్కులు, బి నవ్య 573 మార్కులు సాధించగా, వీరికి శ్రీకాకుళం, నూజివీడు, ఒంగోలు త్రిపుల్ ఐటిల్లో సీట్లు సాధించారు. వీరిని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ నెంబరు పర్వత సురేష్ ప్రిన్సిపాల్ వీరరాజు, స్కూలు కమిటి చైర్మన్ జి లక్ష్మీజ్యోతి, కాకినాడ జిల్లా డిఇఓ పి రమేష్, శంఖవరం మండలం ఎంఇఓలు ఎస్వీ రమణ, టి గోవింద్, ఉపాధ్యాయులు, మోడల్ స్కూలు సిబ్బంది అభినందించారు.

# ర్యాలి రామకృష్ణ జిల్లా పరిషత్ హైస్కూల్ ఘన విజయం





### ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో జిల్లాలో రెండో స్థానం.. ఏడు మంది విద్యార్థులకు సీట్లు

**ఆత్రేయపురం, పెన్ పవర్ జూన్ 14:** ట్రిపుల్ ఐటీ ప్రవేశ ఫలితాల్లో ఆత్రేయపురం మండలం ర్యాలి రామకృష్ణ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి కొత్తపేట నియోజకవర్గానికి మరోసారి గర్వకారణంగా నిలిచారు. తాజాగా ప్రకటించిన ఫలితాల్లో పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలలో సీట్లు సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు.
ఎంపికైన విద్యార్థుల్లో డి. మేఘన నూజివీడు క్యాంపస్‌కు ఎంపిక కాగా, టి. సత్యవేణి, కె. పవన్ కుమార్, సిహెచ్. నవ్యశ్రీ, కె. లక్ష్మీనరసమ్మ ఇడుపులపాయ క్యాంపస్‌కు ఎంపికయ్యారు. అలాగే వి. జ్ఞానకుమార్, ఎం. సుధీర్ కుమార్ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ ప్రాంగణాల్లో ప్రవేశానికి అర్హత సాధించారు.
ఈ విజయంతో ర్యాలి హైస్కూల్ జిల్లా వ్యాప్తంగా అత్యధిక ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించిన పాఠశాలల జాబితాలో రెండో స్థానాన్ని దక్కించుకుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్. సూరిబాబు వెల్లడించారు. గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఉన్నత విజయాలు సాధించవచ్చని ఈ ఫలితాలు మరోసారి నిరూపించాయని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల ఈ ఘన విజయంపై ఎస్ఎంసీ చైర్మన్ దుర్గారావు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ వారి ఉన్నత విద్యాభ్యాసంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.
ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సైతం పోటీ ప్రపంచంలో తమ ప్రతిభతో సత్తా చాటగలరనే విషయాన్ని ర్యాలి హైస్కూల్ విద్యార్థులు మరోసారి నిరూపించారు.






## తహశీల్దార్‌గా పదోన్నతి పొందిన మొసలి సూరిబాబుకు ఘన సన్మానం

**కాకినాడ, పెన్ పవర్ జూన్ 14**: పదోన్నతి అనేది ఉద్యోగ జీవితంలో గౌరవప్రదమైన అవకాశం మాత్రమే కాకుండా మరింత బాధ్యతగా భావించి విధులు నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు పితాని త్రినాధరావు అన్నారు. ఆదివారం కాకినాడలోని రెవెన్యూ అసోసియేషన్ మందిరంలో తాళ్లరేవు మండల డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తూ శంఖవరం మండల తహశీల్దార్‌గా పదోన్నతి పొందిన మొసలి సూరిబాబుకు అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పితాని త్రినాధరావు మాట్లాడుతూ, సూరిబాబు ఉద్యోగంలో చేరిన నాటి నుంచి ఆయన పనితీరును గమనిస్తున్నానని తెలిపారు. రెవెన్యూ సంఘంలో కోశాధికారిగా పనిచేసి అత్యధిక మెజారిటీతో ఎన్నిక కావడం ఆయనకు ఉన్న ఆదరణకు నిదర్శనమని పేర్కొన్నారు. శంఖవరం మండలంలో వీఐపీల రాకపోకలు ఎక్కువగా ఉంటాయని, అక్కడ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.
పదోన్నతి పొందిన సూరిబాబు మాట్లాడుతూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా విధులు నిర్వర్తించి మండల ప్రజల మన్ననలు పొందేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా సూరిబాబు దంపతులను తాళ్లరేవు మండల రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.రామ్మోహన్‌రావు, జిల్లా ఉపాధ్యక్షులు కె. చంద్రశేఖర్ రెడ్డి, ట్రెజరర్ కె.వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



# పోలీసుల ఆధ్వర్యంలో‘సండేస్ ఆన్ సైకిల్’ కార్యక్రమం

**కాకినాడ, పెన్ పవర్ జూన్ 14:** ఫిట్ ఇండియా సైకిల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ‘సండేస్ ఆన్ సైకిల్’ కార్యక్రమాన్ని కాకినాడ జిల్లా పోలీసు యంత్రాంగం ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించింది. కాకినాడ జిల్లా ఎస్పీ జి బిందుమాధవ్ ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమం, జిల్లా పోలీసు కార్యాలయం నుంచి సర్పవరం జంక్షన్ వరకు సాగింది. జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ అదనపు ఎస్పీ ఎస్ శ్రీనివాసరావు సారథ్యంలో నిర్వహించిన సైకిల్ ర్యాలీలో ఏఆర్ డీఎస్పీ వి జి శ్రీహరిరావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు ఆర్ నరసింహమూర్తి, కె వెంకటరావు, ట్రాఫిక్ వన్ ఇన్‌స్పెక్టర్ ఎన్ రమేష్, పోర్ట్ ఇన్‌స్పెక్టర్ పి సునీల్ కుమార్, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ టి దుర్గాప్రసాద్, కాకినాడ టూ టౌన్ ఎస్సై బుజ్జిబాబు, ఆర్ఎస్సై వల్లీ బాబా తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు “పచ్చని ప్రకృతి కోసం ప్రతి ఒక్కరూ సైకిల్ వాడాలి”, “గ్రీన్ ఫ్యూచర్ కోసం సైక్లింగ్ మంత్రం -- పర్యావరణ పరిరక్షణే మన లక్ష్యం” వంటి సందేశాలతో కూడిన ప్రదర్శన బోర్డులను ప్రదర్శిస్తూ సైక్లింగ్ నిర్వహించారు. ఫిట్‌నెస్ పట్ల ప్రజల్లో ఆసక్తిని పెంపొందించడం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడం లక్ష్యంగా నిర్వహించిన ‘సండేస్ ఆన్ సైకిల్’ కార్యక్రమం విజయవంతమైందని జిల్లా పోలీసు అధికారులు తెలిపారు.



# కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారు-తెలుగు మహిళలు




**కాకినాడ, పెన్ పవర్,జూన్ 14**: ఎన్డీఏ కూటమి ప్రభుత్వం భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పాలన సాగిస్తోందని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలుగు మహిళా నాయకులు పేర్కొన్నారు.ఆదివారం కాకినాడలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తుమ్మల సునీత రమేష్,నగర తెలుగు మహిళా అధ్యక్షురాలు కొప్పనాతి నాగకుమారి, 22వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి పీర్ల లక్ష్మీ ప్రసన్న మాట్లాడారు.తుమ్మల సునీత రమేష్ మాట్లాడుతూ,కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో ప్రజలకు ఉపయోగపడే అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదని తెలిపారు.తల్లికి వందనం,స్త్రీ శక్తి, ఉచిత గ్యాస్ సిలిండర్లు,మెగా డీఎస్సీ, రైతు భరోసా, అన్న క్యాంటీన్లు, పరిశ్రమల స్థాపన ద్వారా ఉపాధి అవకాశాల కల్పన వంటి కార్యక్రమాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాయని అన్నారు.ప్రతిపక్ష వైసీపీ నాయకులు ప్రభుత్వ పనితీరును విమర్శించడం కంటే ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా స్పందించాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతిపక్షాలపై ఆంక్షలు ఉండేవని, ప్రస్తుతం ప్రజాస్వామ్య వాతావరణంలో ప్రతి ఒక్కరికీ తమ అభిప్రాయాలను వ్యక్తపరిచే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో రహదారుల అభివృద్ధి సహా పలు రంగాల్లో వేగవంతమైన పురోగతి సాధ్యమైందని చెప్పారు.నగర తెలుగు మహిళా అధ్యక్షురాలు కొప్పనాతి నాగకుమారి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల అమలు ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తోందని తెలిపారు. తల్లికి వందనం, స్త్రీ శక్తి, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి కార్యక్రమాలు మహిళలకు ఆర్థికంగా తోడ్పడుతున్నాయని పేర్కొన్నారు. ఉద్యోగ నియామకాల విషయంలో కూడా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు.పీర్ల లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ,మహిళల భద్రత, ప్రజల సంక్షేమం విషయంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో పార్టీ శ్రేణులు మరింత కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో తెలుగు మహిళా నాయకులు వడిసెల దాలమ్మ, ముత్యాల రాణి,అయేషా, తిరిది ఎల్లయ్యమ్మ, పెదపాటి కుమారి, బత్తిన ఉమా,కుసుమ కుమారి,కోడూరి నీలిమ,పట్నాల రాఘవమ్మ,బుంగా నీలిమ, మాగంటి మంగ,రామలక్ష్మి, బెక్కం ఉమా,గొల్లపూడి మంగదుర్గ, నమ్మి సత్యవాణి,రమ్య,లంక నాగమణి తదితరులు పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## అన్నవరం దేవస్థానంలో భక్తి శ్రద్ధలతో 'కోలాటం' కార్యక్రమం



**అన్నవరం, పెన్ పవర్ జూన్ 14**
ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో ఆదివారం కోలాటం కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువర్యులు ఏ. సురేష్ బాబు గారి ఆధ్వర్యంలో విచ్చేసిన ద్వారపూడికి చెందిన 'కల్యాణ సీతారామ చంద్రమూర్తి స్వామి కోలాటం బృందం' ఈ ప్రదర్శన ఇచ్చింది.

?స్వామివారి సన్నిధిలో భక్తి పారవశ్యంతో కోలాటం బృందం ప్రదర్శించిన సాంప్రదాయ నృత్యాలు, దరువులు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శనతో అన్నవరం క్షేత్రంలో ఆధ్యాత్మిక వాతావరణం మరింత సంతరించుకుంది.

?బృంద సభ్యులకు అభినందనలు:

?ఈ విశేష కోలాటం కార్యక్రమాన్ని దేవస్థానం కార్యనిర్వాహణ అధికారి (ఈఓ) నల్లం సూర్యచక్రధర్ రావు మరియు ధర్మకర్త మండలి సభ్యులు వై.బాబ్జి గారు స్వయంగా వీక్షించారు. అనంతరం కోలాటం బృంద సభ్యులను వారు ప్రత్యేకంగా అభినందించారు. మన భక్తి, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ, భవిష్యత్ తరాలకు అందించేలా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతైనా అభినందనీయమని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

?కార్యక్రమం ముగిసిన తర్వాత కోలాటం బృంద సభ్యులకు దేవస్థానం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసి, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ వజ్రపహార్‌లో కాకినాడ జిల్లా పోలీసుల విస్తృత తనిఖీలు

### కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో 30 మోటార్ సైకిళ్లు సీజ్





**కాకినాడ, పెన్ పవర్,జూన్ 14:** శాంతిభద్రతల పరిరక్షణ,నేరాల నియంత్రణ లక్ష్యంగా కాకినాడ జిల్లా పోలీసులు ఆదివారం "ఆపరేషన్ వజ్రపహార్"లో భాగంగా భారీ స్థాయిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ ఆదేశాల మేరకు అసాంఘిక కార్యకలాపాల గుర్తింపు, అక్రమ వలసదారులు,అనుమానాస్పద కదలికలు,గంజాయి,నాటుసారాయి వంటి అక్రమ నిల్వల గుర్తింపు కోసం ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టారు.పెద్దాపురం కోట ప్రాంతంలో ఇన్‌స్పెక్టర్ వై.ఆర్.కె. శ్రీనివాస్,ఎస్ఐ వి.మౌనిక ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది తనిఖీలు నిర్వహించగా,కాకినాడ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రేచర్లపేట ప్రాంతంలో టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎం. అప్పలనాయుడు,త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ కె.వి.ఎస్.సత్యనారాయణ,వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎం.వి. నాగదుర్గారావు నేతృత్వంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా సరైన పత్రాలు లేని వాహనాలపై చర్యలు తీసుకున్నారు. పెద్దాపురం పోలీసులు 6 మోటార్ సైకిళ్లను,కాకినాడ టూ టౌన్ పోలీసులు 24 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్లకు తరలించారు. మొత్తం 30 మోటార్ సైకిళ్లు సీజ్ చేశారు.అదేవిధంగా స్థానిక ప్రజలకు సైబర్ నేరాల నివారణ, మహిళల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ,మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు.అత్యవసర పరిస్థితుల్లో 112 టోల్‌ఫ్రీ నంబర్‌ను,గంజాయి తదితర మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారాన్ని అందించేందుకు 1972 నంబర్‌ను,సైబర్ నేరాల ఫిర్యాదుల కోసం 1930 హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని పోలీసు అధికారులు ప్రజలకు సూచించారు.ఈ ప్రత్యేక ఆపరేషన్ ద్వారా నేరాల నియంత్రణతో పాటు ప్రజల్లో భద్రతా అవగాహన పెంపొందించడం లక్ష్యంగా పనిచేస్తున్నట్లు జిల్లా పోలీసు అధికారులు తెలిపారు.

## పలువురు మృతుల కుటుంబాలకు స్టాలిన్ బాబు పరామర్శ



**అంబాజీపేట, పెన్ పవర్, జూన్ 14:** పి గన్నవరం నియోజకవర్గంలోని ఇటీవల మృతి చెందిన పలువురు కుటుంబాలను వైఎస్ఆర్సిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు నేలపూడి స్టాలిన్ బాబు పరామర్శించారు. ఆయా కుటుంబాల వారికి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. మృతి చెందిన వారి ఆత్మ శాంతికి ప్రార్థించారు.అంబాజీపేట మండల వైయస్సార్ పార్టీ కార్యదర్శి ముత్తాబత్తుల సామ శేఖర్ తల్లి అనారోగ్యంతో మరణించడంతో ఆయనను ఓదార్చారు. అదేవిధంగా భార్యవియోగంతో బాధపడుతున్న దళిత నాయకులు నాగాబత్తుల నరసింహమూర్తి మరియు పులపకూర సత్య నారాయణ, కొంబత్తుల పవన్ లను పరామర్శించారు. మాతృవియోగంతో బాధపడుతున్న ఆర్ఎంపీ డాక్టర్ వసంత గోపాల్ రాజు, కోట హోమ కృష్ణ లను పరామర్శించి మృతుల చిత్రపటాలకు నివాళులు అర్పించారు. ఆయన వెంట సీనియర్ నాయకులు మైలే ఆనందరావు, ఇసుకపట్ల శ్రీనివాసరావు, పాలమూరి హరిప్రసాద్, గోసంగి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

## ఆదిత్య విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస తరగతులు





**కాకినాడ, పెన్ పవర్,జూన్ 14:** విద్యార్థుల్లో నైతిక విలువలు, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాల పెంపొందనకు భగవద్గీత బోధనలు ఎంతో ఉపయోగపడతాయని ఇస్కాన్ స్వామీజీ శ్రీ అనంత శేష దాసు పేర్కొన్నారు.ఆదివారం కాకినాడ లక్ష్మీనారాయణ నగర్‌లోని ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) కార్యక్రమాల్లో భాగంగా కొప్పవరంలోని ఇస్కాన్ ఆలయంలో విద్యార్థులు, అధ్యాపకుల కోసం వ్యక్తిత్వ వికాస కార్యక్రమం నిర్వహించినట్లు అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు తెలిపారు.ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ భగవద్గీత కేవలం ఆధ్యాత్మిక గ్రంథం మాత్రమే కాకుండా జీవితాన్ని సక్రమంగా నడిపించే మార్గదర్శకమని అన్నారు. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని విజయాలు సాధించాలంటే గీతా బోధనలను ఆచరణలో పెట్టాలని విద్యార్థులకు సూచించారు.కార్యక్రమంలో క్రమశిక్షణ, సమయపాలన, నాయకత్వ నైపుణ్యాలు, ఒత్తిడి నిర్వహణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. భగవద్గీతలోని శ్లోకాల భావాన్ని సులభంగా వివరించి, వాటి ద్వారా వ్యక్తిత్వ వికాసానికి కలిగే ప్రయోజనాలను తెలియజేశారు.సత్వ, రజో, తమో గుణాల గురించి వివరిస్తూ, సత్వగుణాన్ని పెంపొందించే ఆహార అలవాట్లు, జీవన విధానాన్ని అలవరచుకోవాలని సూచించారు. దైనందిన జీవితంలో ఏకాగ్రత పెరగాలంటే ధ్యానం తప్పనిసరి అని పేర్కొన్నారు.విద్యార్థులకు నైతిక విలువలను బోధిస్తున్న స్వామీజీకి ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల కార్యదర్శి డాక్టర్ నల్లమిల్లి సుగుణ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు టి. తేజేశ్వరరావు, డి. అశ్విని, అధ్యాపకులు కావ్యశ్రీ, సుభాషిణి,సుమశ్రీ, భక్తులు మరియు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# రక్తదానం ప్రాణదానంతో సమానం



డాక్టర్ అడ్డాల సత్యనారాయణ

**కాకినాడ, పెన్ పవర్ జూన్ 14:** గాయాలు, అత్యవసర వైద్య పరిస్థితులు, శస్త్రచికిత్సల సమయంలో రక్తం అత్యంత కీలకమైందని, అందువల్ల రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమని దంత వైద్య నిపుణులు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు.అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ప్రతి ఏడాది జూన్ 14న ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహించడం ద్వారా రక్తదానం యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేస్తారని ఆయన అన్నారు. మానవ శరీరంలో రక్తం కీలక పాత్ర పోషిస్తుందని, శరీరానికి అవసరమైన పోషకాలను అందించడంతో పాటు వ్యర్థ పదార్థాలను బయటకు పంపించడంలో ముఖ్యమైన బాధ్యత నిర్వహిస్తుందని వివరించారు.యుక్తవయస్సు నుంచి 60 సంవత్సరాల వయస్సు వరకు ఆరోగ్యవంతులు వైద్యుల సూచనల మేరకు ప్రతి నాలుగు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని తెలిపారు. రక్తదానం వల్ల దాత ఆరోగ్యానికి ఎటువంటి హాని ఉండదని, అవసరమైన సమయంలో అనేక మంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలుమార్లు స్వచ్ఛందంగా రక్తదానం చేసిన ఏ.వి. శ్రీనివాసరావు, పి.శివకుమార్‌లను ఘనంగా సత్కరించి అభినందించారు.కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్,నిమ్మకాయల వెంకటేశ్వరరావు,బుద్ధరాజు సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

## అన్నవరంలో అత్యంత వైభవంగా శ్రీ సత్యదేవుని రథోత్సవ సేవ



**అన్నవరం పెన్ పవర్ జూన్ 14:**కాకినాడ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి సన్నిధిలో ఆదివారం స్వామి వారి రథోత్సవ సేవ అత్యంత వైభవంగా, కనులపండువగా నిర్వహించారు.

ఈ విశేష సేవలో పాల్గొనేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నిర్ణీత రుసుముతో టికెట్లు కొనుగోలు చేసిన భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారి రథ సేవలో పాల్గొన్నారు. రథోత్సవం సాగుతున్నంత సేపూ భక్తులు, స్థానిక గ్రామస్తులు రథంతో పాటు రాజగోపురం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ స్వామివారిని దర్శించుకున్నారు.

ఈ ఆధ్యాత్మిక మహోత్సవంలో ఆలయ వేద పండితులు, అర్చక స్వాములు, దేవస్థానం అధికారులు, సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా కర్రి అప్పల నరసింహారావు శతజయంతి వేడుకలు

-ముఖ్య అతిథులుగా విశాఖ ఎమ్మెల్యే గణబాబు,గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర



**కిర్లంపూడి, పెన్ పవర్, జూన్ 14:**కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం చిల్లంగి గ్రామంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కర్రి వెంకటేశ్వరరావు తండ్రి కర్రి అప్పల నరసింహారావు శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విప్,విశాఖ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు కె గణబాబు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర,విశాఖ గౌరీ సంఘం అధ్యక్షులు బుద్ధ శివాజీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం "నాన్నకు నూరేళ్లు" ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కర్రి అప్పల నరసింహారావు చేసిన సేవలను ప్రముఖులు స్మరించుకుంటూ కొనియాడారు.సమాజానికి ఆయన అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కర్రి అప్పల నరసింహారావు కుటుంబ సభ్యులు,ఏపీ గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల గణేష్,గౌరీ సంఘ పెద్దలు,గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు తెలుగు మహిళా జాగృతి సేవా సంస్థ ఆర్థిక సహాయం.





**ఏలేశ్వరం, పెన్ పవర్, జూన్ 14:** స్థానిక 20వ వార్డులో బాధిత కుటుంబాలకు తెలుగు మహిళా జాగృతి సేవా సంస్థ చైర్పర్సన్ డాక్టర్ అనూష యాదవ్ ఆదివారం పరామర్శించారు. ఇటీవల అగ్ని ప్రమాదానికి గురైన బాధిత కుటుంబాలను డాక్టర్ అనూష యాదవ్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏ ప్రాంతంలోనైనా మహిళలకు ఏ విధమైన సహాయం కావలసి వచ్చిన తమ సంస్థ ముందుకు వస్తుందని ఆమె తెలుపుతూ, బాధిత కుటుంబాలకు 10,000 రూపాయలు అందించారు. అలాగే సమీపంలోనే అదే కాలనీలో ఇటీవల అనారోగ్యానికి గురైన సతాడ మరియమ్మ అనే బాధితురాలు ను పరామర్శించి ఆమెకు 10,000 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమం లో స్థానిక నాయకులు ముచ్చి అప్పలరాజు, ఈసరపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## విశ్వాసం కోల్పోయాను... నమ్మకం ఎక్కడ..?

బాలిక జ్ఞానేశ్వరి కేసులో తల్లి భవాని ఆవేదన.

**కాకినాడ, బ్యూరో (తుని)పెన్ పవర్,జూన్,14** కాకినాడ జిల్లా తుని మండలం సిహెచ్ అగ్రహారం అదృశ్యమైన చిన్నారి జ్ఞానేశ్వరి కోసం కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్న వేళ, ఆ బాలిక జాడ కనిపెట్టడంలో కీలకంగా భావించిన పెంపుడు కుక్క మృతి చెందడం తల్లిదండ్రులను తీవ్ర ఆవేదనకు గురిచేసింది..

ఈ నేపథ్యంలో చిన్నారి తల్లి భవాని భావోద్వేగంగా స్పందించారు..

"మా పాప జాడను ఆ కుక్క కనుగొంటుందని ఎంతో ధైర్యంగా ఉన్నాం..

ఇప్పుడు ఆ ధైర్యం కూడా మాకు లేకుండా పోయింది..

మా ఆశలు ఒక్కసారిగా నిరాశగా మారిపోయాయి..

ప్రస్తుతం మాకు ఉన్న చివరి ఆశ పోలీస్ శాఖ మాత్రమే," అని ఆమె కన్నీటి పర్యంతమయ్యారు...

ఇప్పటి వరకు పాప ఆచూకీ కోసం పోలీసులు చేసిన కృషిని గుర్తుచేసిన భవాని, "ఇప్పటి వరకు ఎంత కష్టపడ్డారో, అదే పట్టుదలతో దర్యాప్తును మరింత ముందుకు తీసుకెళ్లి మా పాపను మాకు అప్పగిస్తారని నమ్ముతున్నాం" అన్నారు...

పెంపుడు కుక్క మృతిపై తమకు మూడు అనుమానాలు ఉన్నాయని ఆమె వెల్లడించారు..!

మా పాప కనిపించకపోవడంతో కుక్క కూడా తీవ్ర బెంగకు గురై ఉండొచ్చు,,

లేక అవతలి వ్యక్తులు ఏమైనా చేసి ఉండొచ్చు,,

జీపీఎస్ పరికరం కట్టే సమయంలో దానికి గట్టిగా ఏదైనా తగిలి ఉండొచ్చు" అని పేర్కొన్నారు...

"మా పాపను ఎప్పుడూ ఇంటి బయట ఒంటరిగా వదిలిపెట్టలేదు. ఆ రోజు మాత్రం ఇంటి బయట ఆడుకుంటుందనే భావించాను. కానీ ఇలా జరుగుతుందని ఊహించలేదు, అంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేశారు...

"మా పాప జాడ కోసం మాకు ఉన్న అన్ని దారులు ఒక్కొక్కటిగా మూసుకుపోతున్నాయి. ఇప్పుడు మాకు కనిపిస్తున్న ఏకైక దారి పోలీస్ శాఖ మాత్రమే..

మా బిడ్డను సురక్షితంగా మాకు చేరవేయాలని కోరుకుంటున్నాం, అని భవాని వేడుకున్నారు...

ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది..

చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీ కోసం పోలీసులు దర్యాప్తును కొనసాగిస్తుండగా, పాప క్షేమంగా తిరిగి రావాలని కుటుంబ సభ్యులతో పాటు ప్రజలు కూడా ఆకాంక్షిస్తున్నారు.

## అన్నవరం దేవస్థానంలో సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ల సందడి: ఈవోతో ప్రత్యేక సమావేశం





**అన్నవరం, పెన్ పవర్ జూన్ 14 :**ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు, డిజిటల్ కంటెంట్ క్రియేటర్లతో దేవస్థానం కార్యనిర్వాహణ అధికారి (ఈవో) నల్లం సూర్యచక్రధర్ రావుసమావేశం నిర్వహించారు. కాకినాడ జిల్లా అన్నవరం రత్నగిరిపై జరిగిన ఈ వినూత్న కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి దాదాపు 180 మంది ఇన్ఫ్లుయెన్సర్లు, భక్తి ప్రచారకులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా( ఈవో) నల్లం సూర్యచక్రధర్ రావుమాట్లాడుతూ.. సత్యదేవుని ఆలయంలో భక్తులకు కల్పిస్తున్న అత్యాధునిక వసతులు, నిత్య అన్నదాన కార్యక్రమాలు, పరిశుభ్రతకు ఇస్తున్న ప్రాధాన్యతను వివరించారు. స్వామివారి వైభవాన్ని, దేవస్థానం చేపడుతున్న సామాజిక, ధార్మిక కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులకు మరింత విస్తృతంగా చేరవేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

డడిజిటల్ మీడియా ద్వారా సానుకూల దృక్పథంతో, బాధ్యతాయుతంగా సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఇన్ఫ్లుయెన్సర్లు కీలక పాత్ర పోషించాలని ఈవో కోరారు. అనంతరం క్రియేటర్లు సైతం ఆలయ అభివృద్ధికి, భక్తుల సౌకర్యాల మెరుగుదలకు తమ వంతు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ఇన్ఫ్లుయెన్సర్లు అందరికీ దేవస్థానం తరపున కృతజ్ఞతలు తెలియజేశారు

## మహనీయుల ఆశయాలే సమసమాజ నిర్మాణానికి మార్గదర్శకం

దుగ్గుదూరులో డా. బి.ఆర్. అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాల ఆవిష్కరణ






**కాజులూరు, పెన్ పవర్,జూన్ 14:** సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం నెలకొల్పేందుకు మహనీయుల ఆశయాలు మార్గదర్శకంగా నిలుస్తాయని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం అన్నారు.కాజులూరు మండలం దుగ్గుదూరు గ్రామంలో ఆదివారం నిర్వహించిన భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మరియు బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయనతో పాటు జనసేన పార్టీ రామచంద్రపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా విగ్రహాల నిర్మాణం కోసం వాసంశెట్టి సత్యం రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందజేయగా, గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్, సామాజిక న్యాయం కోసం జీవితాంతం కృషి చేసిన బాబూ జగ్జీవన్ రామ్ సేవలు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు.బడుగు, బలహీన వర్గాలకు సమాన హక్కులు, అవకాశాలు కల్పించడంలో వారి పాత్ర అమూల్యమని కొనియాడారు.కుల, మత, వర్గ వివక్షలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు లభించే సమసమాజ నిర్మాణమే ఈ మహనీయుల లక్ష్యమని పేర్కొంటూ, యువత వారి ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సామాజిక చైతన్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ, దేశానికి విశిష్ట సేవలందించిన ఇద్దరు మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. అంబేద్కర్, జగ్జీవన్ రామ్ చూపిన మార్గంలో నడుస్తూ సామాజిక సమానత్వం, ప్రజాసేవ విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని కోరారు.కార్యక్రమంలో మేడిశెట్టి వీర వెంకట సత్యనారాయణ (పెద్ద), రంపాల రాజు, తాతపూడి నాగరాజు, కుడిపూడి గోవిందరాజు,మాతా వెంకటరమణ, మాతా స్వామి,దడాల నాగార్జున, ఖండవల్లి శ్రీనివాసరావు, జల్లి సత్యనారాయణ,గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.అనంతరం మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు, గ్రామంలో సామాజిక ఐక్యత, విద్యాభివృద్ధి, యువత బాధ్యతలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

## అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం.





**ఏలేశ్వరం, పెన్ పవర్, జూన్ 14:** ఇటీవల ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధి 20వ వార్డులోని ఇటీవల విద్యుత్ వల్ల రెండు తాటాకు ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కు గురై దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో నిరుపేదలైన నీలిమణి, నీలి సురేష్ ల ఇల్లు పూర్తిగా ఖాళీ బూడిద అయ్యాయి. సంబంధిత కుటుంబాలు పూర్తిగా నిరశ్రాయులు అయ్యారు. ప్రమాద సమయంలో ఇంట్లో ఉన్న బట్టలు, సామాన్లు, కూడబెట్టుకున్న సొమ్ము మొత్తం పూర్తిగా కాలిపోయాయి. ఈ విషయమై పలు స్వచ్ఛంద సేవా సంస్థలు ఆదివారం బాధిత కుటుంబాలకు సహాయం అందించారు. వివేకానంద సేవా సమితి, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బట్టలు, రెండు బస్తాల బియ్యం, కాయగూరలు, కిరాణా సామాన్లతో పాటు 30 వేల రూపాయల నగదు బాధిత కుటుంబాలకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపద కాలంలో బాధిత కుటుంబాలకు దాతలు ఎవరైనా ముందుకు వచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వివేకానంద సేవా సమిత అధ్యక్షుడు మైరాల నాగేశ్వరరావు, ఏలేశ్వరం మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వాగు రమేష్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అనంతారపురాజు, గొల్లపూడి త్రిమూర్తులు, కామేష్, సురేష్, బుగతా శ్రీను, అడపా సుబ్రహ్మణ్యం, జుత్తుక శ్రీను, రాయుడు చిన్న, రాతి కింద సతీష్, పిరాట్ల రవి, వాగు బద్రిష్, సామంతుల గోపి, పసుపులేటి శ్రీను, గ్యాస్ కుమార్, రాకేష్, మట్టే చిన్న, బుజ్జి బాబు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారుల భవిష్యత్‌కు బలమైన పునాది

**రామచంద్రపురం, పెన్ పవర్ జూన్ 14:** ఆంధ్రప్రదేశ్ మహిళా, శిశు సంక్షేమ శాఖ, ఐటీసీ మిషన్ సునెహ్రా కల్ మరియు ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి సంబంధించిన ప్రత్యేక కార్యక్రమం ఈ నెల 16 న ఉదయం 9 గంటలకు రామచంద్రపురం మున్సిపల్ ఓపెన్ ఆడిటోరియంలో నిర్వహించబడనుంది.ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఆర్. మహేశ్ కుమార్, ఐసిడిఎస్ అధికారులు ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.3 నుండి 6 సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు నాణ్యమైన ప్రాథమిక బాల్య సంరక్షణ మరియు విద్య సేవలను మరింత బలోపేతం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం.అంగన్ వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు ఆనందదాయకమైన, బాలల కేంద్రిత అభ్యాస వాతావరణాన్ని కల్పించేందుకు ఈ కార్యక్రమం దోహదపడనుంది. కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు మరియు ఐసీడీఎస్ సిబ్బందికి శిక్షణలు అందించి వారి సామర్థ్యాలను పెంపొందించడం. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్లే కిట్లు,ప్రీ-స్కూల్ బోధనా-అభ్యాస సామగ్రిని అందించడం ద్వారా నాణ్యమైన ప్రీ-స్కూల్ విద్యను ప్రోత్సహించడం.బాలల కేంద్రిత బోధనా విధానాలను బలోపేతం చేసి చిన్నారుల సమగ్ర అభివృద్ధికి తోడ్పడడం.

తల్లిదండ్రులు మరియు సమాజ భాగస్వామ్యాన్ని పెంపొందించడం ద్వారా పిల్లల అభ్యాస ప్రక్రియలో కుటుంబాల పాత్రను మరింత బలోపేతం చేయడం.ప్రతి చిన్నారి ఆత్మవిశ్వాసంతో, నేర్చుకునేందుకు సిద్ధంగా ప్రాథమిక పాఠశాలలో ప్రవేశించేలా పాఠశాల సిద్ధతను మెరుగుపరచడం.ఈ కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలలో నాణ్యమైన అభ్యాస వాతావరణం ఏర్పడి,చిన్నారుల సమగ్ర అభివృద్ధి, తల్లిదండ్రుల భాగస్వామ్యం మరియు సమాజ సహకారం మరింత బలోపేతం అవుతుందని నిర్వాహకులు ఎస్.ఆర్.గణపతి సుబ్రమణియన్ ఐటీసీ లిమిటెడ్ -- మిషన్ సునెహ్రా కల్ ఒక ప్రకటనలో తెలిపారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియపై బూత్ లెవెల్ ఏజెంట్లు అవగాహన పెంచుకోవాలి.





**కిర్లంపూడి, పెన్ పవర్, జూన్ 14:** ప్రత్యేక ఓటర్ నమోదు ప్రక్రియపై బూత్ లెవెల్ ఏజెంట్లు అవగాహన పెంచుకోవాలని కిర్లంపూడి మండలం భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు శరకణం రాజబాబు అన్నారు.కాకినాడ జిల్లా జగ్గంపేట నియోజకవర్గం కిర్లంపూడి మండలం కిర్లంపూడి రాజుగారి గెస్ట్ హౌస్ లో ఆదివారం బి ఎల్ ఏ 2 కార్యక్రమంలో భాగంగా బి ఎల్ ఏ 1 జగ్గంపేట నియోజవర్గ ఇన్చార్జి కంబాల శ్రీనివాసరావు పర్యవేక్షణలో కిర్లంపూడి మండలం బిజెపి అధ్యక్షులు శరకణం రాజబాబు అధ్యక్షతన మండలంలోని భారతీయ జనతా పార్టీ బూత్ ఏజెంట్లకు ఓటర్ నమోదు ప్రక్రియ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరై బిఎల్ఎ 2 కార్యక్రమాన్ని ప్రజల్లోకి ఈ విధంగా తీసుకువెళ్లాలో వివరించారు. కొత్త ఓట్లు నమోదు ప్రక్రియతో పాటు చనిపోయిన వారు ఓట్లు తీసివేయడం మరియు ఓటరుయొక్క పూర్తి వివరాలు డేటాలో పొందుపరిచే విధంగా ఈ కార్యక్రమాన్ని తీర్చిదిద్దడం జరిగిందని మండల అధ్యక్షులు రాజబాబు తెలియజేసారు.ఈ కార్యక్రమం పట్ల అవగాహన కల్పించారు.మండలంలోని 65 బూత్ లు ప్రతి పార్టీకి పిఎస్ కి ఒక్కరు చొప్పున బి ఎల్ ఎ లు, బి ఎల్ ఓ లతో కలిసి మండలంలో ఉన్నటువంటి ప్రతి ఇంటికి వెళ్లి ప్రతి ఓటరు డేటా అప్లికేషన్ లో ఎంటర్ చేయించి, వారి యొక్క సంతకాన్ని తీసుకుని అప్లికేషన్లు బి ఎల్ ఓ కి అందజేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కంబాల శ్రీనివాసరావు అనుచరులు మణిరత్నం, నానాజీ, వెంకన్న దొర, కాకినాడ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఐ వి వి సత్యనారాయణమూర్తి, మండల పూర్వ అధ్యక్షులు యడాలి రాంబాబు, కాకినాడ జిల్లా ఓ బి సి మోర్చా ఉపాధ్యక్షులు కంటా కాశీ విశ్వనాథం, మండల ప్రధాన కార్యదర్శి కోనేటి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు బుద్ధ పెద్దకాపు, తణుకు మంగతాయారు, మండల ఓబిసి అధ్యక్షులు పెంటకోట సత్యనారాయణ, ఏనుగులపల్లి జలబాబు, జ్యోతుల దుర్గాప్రసాద్, జోకా సత్తిబాబు, ఆడారి రామచంద్రరావు, బొడ్డేటి చిన్నబ్బాయి, బొడ్డేటి బాబురావు, జలసూత్ర శ్రీనివాస్ రావు, గోడే యేసుబాబు, సామన యువరాజు, మిరియాల వెంకటేష్, పెదగాడ లోవరాజు, అప్పికొండ కృష్ణ సాగర్, పెండ్యాల నాగేశ్వరరావు, నైదాన రవి, ఇసరపు శివబాబు, దొడ్డ అప్పారావు, విజయ్ కుమార్, పప్పల రాంబాబు, బిశెట్టి కోటేశ్వరరావు , కొన్నపూడి నాగేశ్వరరావు,పెద్ద సంఖ్యలో బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ట్రిపుల్ ఐటికి ఇద్దరు ప్రత్తిపాడు హైస్కూలు విద్యార్థులు ఎంపిక.





**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, జూన్ 14:** ట్రిపుల్ ఐటికి ఇద్దరు ప్రత్తిపాడు హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు.శ్రీ రెడ్నం రామ్మూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థులు చవల శ్రవణ్ కుమార్ ట్రిపుల్ ఐటి ఆర్కే వ్యాలీ, ఇడుపులపాయ కి ఎంపిక అవ్వగా, మైనపాటి నీరజ్ ట్రిపుల్ ఐటీ శ్రీకాకుళం నకు ఎంపికయ్యారు. వీరి ఎంపిక అవడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్ మాదే రాజేంద్రకుమార్, కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు విద్యార్థులను అభినందించారు.

# ఎటపాక జవహర్ నవోదయకు శ్రీ భారతి విద్యార్థిని ఎంపిక.




**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, జూన్ 14:** ప్రత్తిపాడు మండలం ఒమ్మంగిలోని శ్రీ భారతి విద్యా సంస్థల విద్యార్థిని కంటా రత్నప్రశాంతి 9వ తరగతి ప్రవేశానికి ఎటపాక జవహర్ నవోదయ విద్యాలయానికి ఎంపికయ్యింది.ఈ సందర్భంగా శ్రీ భారతి విద్యా సంస్థల అధినేత సుంకర వీరబాబు హర్షం వ్యక్తం చేసి,విద్యార్థిని రత్నప్రశాంతిని అభినందించారు.ప్రతిభావంతులైన విద్యార్థులను తీర్చిదిద్దడంలో తమ విద్యా సంస్థలు ఎప్పుడూ ముందంజలో ఉంటాయని ఆయన పేర్కొన్నారు.తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని,అన్ని తరగతులకు అడ్మిషన్లు కొనసాగుతున్నాయని ఈ సందర్భంగా కరెస్పాండెంట్ సుంకర వీరబాబు తెలిపారు.

## పేదల సామాజిక పింఛన్లు తక్షణమే మంజూరు చేయాలి.

-ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి పాతంశెట్టి సూర్యచంద్ర.



**కిర్లంపూడి, పెన్ పవర్, జూన్ 14:** రెండేళ్ల కాలయాపన చాలు, ఇకనైనా పేదల సామాజిక పింఛన్లు తక్షణమే మంజూరు చేయాలని జగ్గంపేట నియోజకవర్గం ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి పాతం చెట్టి సూర్యచంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగ్గంపేట నియోజకవర్గంలో పేదల కష్టాలను వివరిస్తూ పాలకులను, అధికారులను నిలదీశారు. పాటంశెట్టి సూర్యచంద్ర.?పింఛన్లు రాక అవస్థలు పడుతున్న బాధితులు బూరుగుపూడి గ్రామంలో సూర్యచంద్రను కలిసి తమ కష్టాలను చెప్పి తమ సమస్య పరిష్కరించాలని కోరడంతో బాధితులకు ధైర్యం చెప్పి అండగా ఉంటామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చే వరకు పేదలకు పింఛన్లు, ప్రభుత్వ పథకాలు పూర్తి స్థాయిలో వచ్చే విధంగా పేదల పక్షాన పోరాడుతామని సూర్యచంద్ర స్పష్టం చేశారు.ఎన్నికల ముందు రంగురంగుల అబద్ధాలు చెప్పి, అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటుతున్నా పేదలకు సామాజిక పింఛన్లు అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పాటంశెట్టి సూర్యచంద్ర ఆరోపించారు. జగ్గంపేట నియోజకవర్గంలో పింఛన్లు అందక నానా అవస్థలు పడుతున్న వృద్ధులు, వితంతువులు, వికలాంగుల బాధలు, కష్టాలు ప్రభుత్వానికి వివరించారు.స్థానిక ఎమ్మెల్యే, కూటమి ప్రభుత్వం ప్రజలను నిలువునా వంచించారన్నారు.ఎన్నికల ప్రచారంలో ప్రతి పేదవాడికి పింఛన్ ఇస్తామని నమ్మబలికి ఓట్లు వేయించుకున్నారని, గెలిచాక రెండేళ్లు గడుస్తున్నా అర్హులకు పింఛన్లు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. లబ్ధిదారుల పొట్టగొడుతూ, నిస్సిగ్గుగా విజయోత్సవాలు జరుపుకోవడం ప్రజాస్వామ్యానికే విరుద్ధమన్నారు. ఇప్పటికైనా ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించి ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలన్నీ నెరవేర్చాలని పాటంశెట్టి సూర్యచంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## వాకిట ఇంటి దగ్గర..కాయగూరలు అంగట్లోంచి






**ఏలూరు జూన్ 14 పెన్‌పవర్ :** మాతా శిశు సంరక్షణ ప్రాజెక్టు పెదపాడు సెక్టార్ సెంటర్ నెం.14 కు చెందిన పోషణ్ వాటిక అంగన్ వాడీ కేంద్రంలో కాకుండా నిర్వాహకులు ఇంటి వద్దనే ఏర్పాటు చేసుకోవడం విమర్శలకు తావిస్తోంది.సొంత భవనాలు కలిగిన అంగన్ కేంద్రాలకు ఐసిడిఎస్ అదికారులు పోషణ్ వాటిక నిర్వాహణకురూ.10వేలు మంజూరు చేసింది.అంగన్‌వాడీచిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు, పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ఆ శాఖ అధికారులు వీటిని ఏర్పాలు చేసి నిర్వహణ బాద్యతను అంగన్ వాడీ కార్యకర్తలకు,అంగన్ వాడీ సెంటర్ నిర్వాహకులకు అప్పగించింది

### విస్తీర్ణం సమస్య

కేంద్రంలో అన్నీ సదుపాయాలు ఉన్నా పోషన్ వాటికను ఇంటిదగ్గర నిర్వహించడం ,వాటిక నిర్వహణ ఎలా ఉంది అనే విషయం పర్యవేక్షణ అధికారులు పక్కన పెడితే,వాటికలో పండిన కాయగూరలు లబ్దిదారులకు అందడం లేదనే విమర్శలు వ్యక్తమౌతున్నాయి.అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం ఉన్నా భవనానికి సరిహద్దులు లేక పోవడంతో రక్షణ గోడ ఏర్పాటు చేయలేదు.దీంతో అంగన్ వాడీ కేంద్రానికి ఎంత స్దలం ఉందో నిర్వాహకులకు తెలియని పరిస్దితి.కేంద్రం ముందు విశాలమైన స్దలం ఉండడం,ఆస్తలంలో ఫంక్షన్‌లు,ఇతరత్రా కార్యక్రమాలు చేస్తుండటంతో కేంద్రం నిర్వహణ సమయంలో శబ్దాలు,ఇతర కార్యక్రమాల వల్ల ఆటంకాలు ఏర్పడుతోంనే విమర్శలు వినిపిస్తున్నాయి.కేంద్రాని హద్దులు నిర్ణయించి రక్షణ గోడ ఏర్పాటుచేయాని లబ్దిదారులు,చిన్నారుల తల్లి తండ్రులు కోరుతున్నారు

### నిర్వహణ లోపం

కేంద్రానికి సరఫరా చేస్తున్న కోడిగుడ్లు నాసిరకంగానూ,బరువు తక్కువగానూ ఉన్నా వాటిని నిర్వాహకులు చిన్నారులకు వండి పెడుతున్నారు.కేంద్రంలో వాటర్‌ప్యూరీ ఫైయర్ ఉన్నా చిన్నారులకు ప్యూరి ఫైయర్ లో రక్షిత తాగు నీరు సరఫరా జరుగడం లేదనే విమర్శలు వ్యక్తమౌతున్నాయి.పర్యవేక్షణాధికారులు చర్యలు తీసుకుని వాటికకు సరిహద్దులు ఏర్పాటు చేసి రక్షణ గోడ నిర్మించి,పోషణ్ వాటిక అంగన్ వాడీ కేంద్రం వాకిట ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

# జైభీమ్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల విజేతలకు బహుమతి ప్రదానం..




**అల్లవరం,పెన్ పవర్, జూన్ 14:** జైభీమ్ ప్రమీయర్ లీగ్ క్రికెట్ పోటీలు ఫైనల్స్ ఆదివారం మ్యాచ్ లో ప్రీమియర్ లీగ్‌లో ఫైనల్ విన్నర్‌గా కొమరగిరిపట్నం ఫ్రెండ్స్ లెవెన్ టీమ్ విజేతగా నిలిచింది.. అల్లవరం మండలం కొమరగిరిపట్నం జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో గత 15 రోజులుగా జైభీమ్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు జరుగుతున్నాయి.ఆదివారం ఫైనల్స్ పోటీలు జరగ్గా ఫ్రెండ్స్ లెవెన్, అల్లవరం టీమ్‌లు ఫైనల్స్‌లో తలపడ్డాయి. లీగ్ విజేత ఫ్రెండ్స్ లెవెన్ టీమ్ విన్నర్ గా నిలవగా అల్లవరం టీమ్ రన్నర్‌గా నిలిచింది. అనంతరం జరిగిన బహుమతి ప్రదాన కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా సామాజిక సేవకుడు, రిటైర్డ్ టీచర్ మోసుగంటి వెంకటేశ్వరరావు, ప్రముఖ వైద్యుడు, సివిల్ సర్జన్ పరమట నరసింహమూర్తి, క్యాపిటల్ హాస్పటల్ అధినేత నక్కా విజయ్‌కుమార్, బీజేపీ నాయకుడు ఉల్లూరి గంగాధర్, అంజిబాబు, బళ్ల సత్యనారాయణ, కాట్రు శాంతి కిరణ్, వడ్డి వేంకటేశ్వర రావులు హాజరయ్యారు..ఫైనల్స్ విజేతకు ట్రోఫీ, బహుమతులు ముఖ్యఅతిధులు అందజేశారు. ఈకార్యక్రమంలో జైభీమ్ లీగ్ నిర్వహకులు యలమంచిలి రమేష్, బళ్ల శ్యామ్, చెల్లి నాగేంద్ర, సాధనాల రమేష్, కడిమి నవీన్, రేవు సురేష్, యల్లమెల్లి బాబి తదితరులు పాల్గొన్నారు.

# నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటిన టైక్వాండో క్రీడాకారులు



**కాకినాడ బ్యూరో (పిఠాపురం,) పెన్ పవర్, జూన్, 14 :** పిఠాపురం ఎస్ఎన్ఆర్ టైక్వాండో క్లబ్ విద్యార్థులు జాతీయ స్థాయిలో సత్తా చాటారు. ఫస్ట్ నేషనల్ టైక్వాండో ఓపెన్ ఛాంపియన్షిప్-2026 లో పాల్గొని 25 మంది క్రీడాకారులు గోల్డ్,సిల్వర్ మరియు బ్రాంజ్ మెడల్స్ సాధించి పిఠాపురం పట్టణానికి పేరు తెచ్చారు. ఈ విజయం సాధించిన విద్యార్థులను అభినందిస్తూ పట్టణంలోని ఆర్ఆర్ పార్కు నందు ఘనంగా సన్మాన సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పిఠాపురం జనసేన పార్టీ ఇంచార్జ్ డాక్టర్ చిక్కాల వరలక్ష్మి, పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... టైక్వాండో కేవలం క్రీడ మాత్రమే కాదని, విద్యార్థులకు ఆత్మరక్షణకు ఇది ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. క్రీడల్లో రాణించడం వల్ల ఉన్నత విద్యలో స్పోర్ట్స్ కోటా సీట్లు లభించడమే కాకుండా, భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని వారు సూచించారు. ?క్లబ్ కోచ్ నాగరాజు మాట్లాడుతూ... విద్యార్థుల నిరంతర కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఈ జాతీయ స్థాయి విజయాలు సాధ్యమయ్యాయని తెలిపారు. తమకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పిస్తే, అంతర్జాతీయ స్థాయిలో కూడా పతకాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ?ఈ కార్యక్రమంలో భాగంగా అతిథులను,కోచ్ నాగరాజును నిర్వాహకులు సత్కరించారు. విద్యార్థుల ప్రతిభను చూసి అభినందించిన వాకింగ్ చేస్తున్న పెద్దలు,క్లబ్ అభివృద్ధికి తమ వంతు ఆర్థిక సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. దాతలు సునీల్-సౌజన్య దంపతులు విద్యార్థుల ప్రోత్సాహార్థం రూ. 5,000 నగదును అందజేశారు. ?ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ వైస్ ఇంచార్జ్ బాలిపల్లి అనిల్, 6వ వార్డు ఇంచార్జ్ గరగ అయ్యప్ప, ఇతర వార్డు ఇన్చార్జిలు వనం వీరబాబు, సూరంపూడి లక్ష్మీపతి, క్రీడాకారుల తల్లిదండ్రులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# వాడే భారత జట్టుకు బిగ్గెస్ట్ వీక్‌నెస్.. గంభీర్ ఇప్పటికైనా కళ్లు తెరవాలి..



**హైదరాబాద్ పెన్ పవర్:** గత కొన్నేళ్లుగా టీమిండియాని వేధిస్తున్న అతిపెద్ద సమస్య ఫాస్ట్ బౌలింగ్ ఆల్ రౌండర్ లేకపోవడమే.. స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా గాయాలు, ఫిట్నెస్ సమస్యలతో ఇబ్బంది పడుతున్న వేళ.. రాబోయే 2027 వన్డే వరల్డ్ కప్ టోర్నమెంట్ ని దృష్టిలో పెట్టుకుని భారత మాజీ ఆటగాడు సురేష్ రైనా వార్నింగ్ ఇచ్చాడు. భారత్ గత రెండు ప్రపంచకప్‌లలో ఎక్కువగా హార్దిక్ పైనే ఆధారపడింది. కానీ, అతడు 2019లో వెన్నునొప్పితో, 2023 ప్రపంచకప్ టోర్నీ మధ్యలోంచే గాయంతో జట్టుని వదిలి పెట్టాడు. కీలక సమయాల్లో హార్దిక్ దూరం కావడంతోనే 2సార్లు టైటిల్స్ ని మిస్ చేసుకోవడం జరిగిందని సురేష్ రైనా వెల్లడించాడు.

**రీప్లేస్‌మెంట్ ప్లేయర్ రెడీ చేస్కోండి:**

సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియా వేదికలుగా 2027 అక్టోబర్ 4 నుంచి వన్డే వరల్డ్ కప్ స్టార్ట్ కాబోతుంది. ఆఫ్రికా పిచ్‌లపై ఫాస్ట్ బౌలర్లు, పేస్ ఆల్ రౌండర్లే చాలా కీలకం కానున్నారు. ఇలాంటి సమయంలో , ఆఫ్ఘనిస్తాన్‌తో వన్డే సిరీస్‌కు ముందు ఫిట్నెస్ క్లియరెన్స్ సాధించిన హార్దిక్, మళ్లీ ప్రాక్టీస్ సెషన్‌లో గాయపడి సిరీస్ కి దూరం కావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. అందుకే, హార్దిక్‌కు సరైన రీప్లేస్‌మెంట్ ప్లేయర్ ని ఇప్పుడే రెడీ చేసుకోవాలని హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కు భారత మాజీ క్రికెటర్ సురేష్ రైనా సూచించాడు.

**బౌలింగ్ లో నితీష్ మెరుగువ్వాల్సిందే:**

హార్దిక్ పాండ్యా ఫిట్‌నెస్‌తో ఉంటే జట్టుకు కొండంత బలం అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.. కానీ అతను వర్క్‌లోడ్‌ను మేనేజ్‌మెంట్ చాలా జాగ్రత్తగా ప్లాన్ చేయాలని సురేష్ రైనా తెలిపాడు. ఒకవేళ పాండ్యా అందుబాటులో లేకపోతే జట్టులో ఆ ప్లేస్ ని ఎవరు భర్తీ చేస్తారనే ప్రశ్నకు భారత మేనేజ్మెంట్ ఇప్పుడే ఆన్సర్ రెడీ చేసుకోవాలన్నాడు. ప్రస్తుతం యువ ఆల్ రౌండర్ నితీష్ రెడ్డి జట్టుకు అందుబాటులో ఉన్నాడు.. అతను బౌలింగ్ లో ఇంకాస్త మెరుగవ్వాల్సిన అవసరం ఉందని రైనా పేర్కొన్నాడు.

**రో-- కో అనుభవం ఎంతో అవసరం:**

మరోవైపు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల ప్రాధాన్యతపై కూడా సురేష్ రైనా కీలక వ్యాఖ్యలు చేశాడు. గత ప్రపంచకప్‌లలో రోహిత్, విరాట్ అద్భుతంగా రాణించి జట్టును ముందుండి నడిపించారని కొనియాడారు. శుభ్‌మన్ గిల్ వంటి యంగ్ ప్లేయర్స్ కి రో-- కో లాంటి సీనియర్ల తోడు, అనుభవం ఎంతో అవసరం.. ఫిట్‌నెస్‌తో ఉంటే ఏ ఆటగాడికైనా వయసు అనేది అస్సలు సమస్య కాదని రైనా తేల్చి చెప్పాడు.

# పాక్‌పై టాస్ గెలిచిన భారత్.. భారీ స్కోర్‌పై కన్నేసిన హర్మన్‌ప్రీత్



**హైదరాబాద్ పెన్ పవర్:** క్రికెట్ ఫ్యాన్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మహిళల టీ20 ప్రపంచకప్ దాయాదుల పోరుకు టాస్ పడింది. బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో భారత మహిళల జట్టు టాస్ గెలిచింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఏమాత్రం ఆలోచించకుండా మొదట బ్యాటింగ్ తీసుకుంది. పిచ్ కండిషన్స్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండటంతో.. బోర్డుపై భారీ స్కోరు బోర్డును ఉంచి పాకిస్తాన్‌ను ఒత్తిడిలోకి నెట్టాలని టీమిండియా పక్కా ప్లాన్ వేసింది.

టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ మాట్లాడుతూ.. మేము మొదట బ్యాటింగ్ చేయబోతున్నాం.. బ్యాటింగ్ చేయడానికి ఇది చాలా అద్భుతమైన పిచ్.. మొదట బ్యాటింగ్ చేసి బోర్డుపై ఒక మంచి టోటల్ సెట్ చేయాలనుకుంటున్నాం.. టీమ్ మొత్తం ఈ మ్యాచ్ కోసం చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది.. గతేడాది వన్డే వరల్డ్ కప్ గెలిచిన కాన్ఫిడెన్స్‌ను ఈ టోర్నీలో కూడా కొనసాగిస్తాం.. మైదానంలో బెస్ట్ క్రికెట్ ఆడటమే మా టార్గెట్.. ఈ మ్యాచ్‌లో భారతి జట్టులోకి వచ్చింది.. మేము ముగ్గురు స్పిన్నర్లు, ఇద్దరు మీడియం పేసర్లతో బరిలోకి దిగుతున్నామని కౌర్ స్పష్టం చేసింది.

పాకిస్తాన్ కెప్టెన్ ఫాతిమా సనా మాట్లాడుతూ.. ఒకవేళ టాస్ గెలిస్తే మేము కూడా మొదట బ్యాటింగ్ చేయాలనే అనుకున్నాం.. ఇదొక మంచి బ్యాటింగ్ ట్రాక్ లా కనిపిస్తోంది.. ఒక టీమ్‌గా మేము బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ బాగా రాణించబోతున్నాం.. ఇక్కడ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలించేలా ఉన్నా.. మా దగ్గర మంచి బౌలింగ్ ఎటాక్ ఉంది.. ఈ మ్యాచ్‌లో సైరా ఆడుతోంది.. ఆమెకు ఇదే మొదటి వరల్డ్ కప్ మ్యాచ్ అని చెప్పుకొచ్చింది.

పాకిస్థాన్ మహిళా జట్టు: గుల్ ఫిరోజా, మునీబా అలీ (వికెట్ కీపర్), అయేషా జాఫర్, సైరా జబీన్, నటాలియా పర్వైజ్, అలియా రియాజ్, ఫాతిమా సనా (కెప్టెన్), రమీన్ షమీమ్, నష్రా సంధు, సాదియా ఇక్బాల్, తస్మియా రుబాబ్ భారత మహిళా జట్టు: స్మృతి మంధాన, షఫాలి వర్మ, జెమిమా రోడ్రిగ్స్, హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), రిచా ఘోష్ (వికెట్ కీపర్), దీప్తి శర్మ, భారతీ ఫుల్మాలి, శ్రీ చరణి, క్రాంతి గౌడ్, శ్రేయాంక పాటిల్, అరుంధతీ రెడ్డి

# కప్ కొట్టి భారత్‌కి తీసుకొని రండి.. పాక్‌తో పోరుకు ముందు ఉమెన్స్ టీమ్‌కు రోహిత్, గంభీర్ స్పెషల్ మెసేజ్





**హైదరాబాద్ పెన్ పవర్:** : మహిళల టీ20 ప్రపంచకప్‌లో భాగంగా కాసేపట్లో (ఆదివారం) పాకిస్తాన్‌తో జరగబోయే హై-వోల్టేజ్ మ్యాచ్‌కు ముందు హర్మన్‌ప్రీత్ సేనకు మెన్స్ టీమిండియా ఆటగాళ్లు అదిరిపోయే సపోర్ట్ ఇచ్చారు. గతేడాది సొంతగడ్డపై జరిగిన వన్డే ప్రపంచకప్‌ను గెలుచుకుని హిస్టరీ క్రియేట్ చేసిన భారత మహిళల జట్టు.. ఇప్పుడు తమ తొలి టీ20 వరల్డ్ కప్ టైటిల్‌ను ముద్దాడాలనే కసితో బరిలోకి దిగుతోంది. ఈ క్రమంలో బీసీసీఐ (దీజజ×) ఎక్స్ (శ) వేదికగా షేర్ చేసిన ఒక ప్రత్యేక వీడియోలో రోహిత్ శర్మ, కోచ్ గౌతమ్ గంభీర్, శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్‌లు మహిళల జట్టుకు ఆల్ ది బెస్ట్ చెబుతూ జోష్ నింపారు.

**ఈసారి కప్పు కొట్టాల్సిందే: రోహిత్ శర్మ**

గత కొన్ని ఏళ్లుగా టీమిండియా అమ్మాయిలు అద్భుతమైన క్రికెట్ ఆడుతున్నారని భారత స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ పేర్కొన్నారు. టీ20 వరల్డ్ కప్‌లలో చాలాసార్లు గెలుపుకు అత్యంత దగ్గరగా వచ్చి మిస్ అయ్యారు. కానీ, ఈసారి మాత్రం వాళ్లు కచ్చితంగా కప్పు కొట్టాలని నేను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.. దేశం మొత్తం వాళ్లకు సపోర్ట్‌గా ఉంది.. మన జట్టు చాలా పటిష్టంగా, బ్యాలెన్స్‌డ్‌గా ఉంది.. ఇంగ్లాండ్ కండిషన్స్‌ని వాళ్లు బాగా ఎంజాయ్ చేస్తారు.. మెన్స్ టీమిండియా తరఫున అమ్మాయిలందరికీ ఆల్ ది బెస్ట్ అంటూ రోహిత్ విష్ చేశాడు.

**కప్పుని భారత్ కి పట్టురండి: కోచ్ గంభీర్**

టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తన స్టైల్‌లో పవర్‌ఫుల్ మెసేజ్ ఇచ్చాడు. మీరు 140 కోట్ల మంది భారతీయులు గర్వపడేలా చేస్తారని నాకు నమ్మకం ఉంది. ప్రపంచ వేదికపై దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం అందరికీ రాదు.. మైదానంలో తప్పులు జరుగుతాయేమోనని అస్సలు భయపడకండి.. ఎప్పుడు డౌట్ వచ్చినా పాజిటివ్ రూట్‌నే ఎంచుకోండి.. గుడ్ లక్.. కప్పు ఇంటికి (భారత్ కి) పట్టురండి అంటూ గంభీర్ కోరాడు.

**గిల్, శ్రేయస్, ఇషాన్ 'కిర్రాక్' మోటివేషన్:**

కెప్టెన్ శుభ్‌మన్ గిల్: మీరు గతంలోనే వరల్డ్ కప్ గెలిచి హిస్టరీ క్రియేట్ చేశారు.. ఈసారి కూడా ఖచ్చితంగా గెలుస్తారు. మా పూర్తి మద్దతు మీకే ఉంటుందని పేర్కొన్నాడు.

# ప్రభాస్ లేకుంటే.. ఆ సినిమా షెడ్డుకేనా?



పాన్



ఇండియా స్టార్ ప్రభాస్ కెరీర్ లో ఎన్నో బ్లాక్ బస్టర్ సినిమాలు ఉన్నప్పటికీ, అభిమానులు గుర్తు చేసుకోవడానికి ఇష్టపడని కొన్ని మూవీలు కూడా ఉన్నాయి. అలాంటి వాటిలో ముందుగా చెప్పుకునే పేరు రెబల్. భారీ అంచనాల మధ్య విడుదలైన ఆ చిత్రం బాక్సాఫీస్ వద్ద తీవ్ర నిరాశ పరిచింది. అయితే తాజాగా ఆ సినిమా వెనుక జరిగిన విషయాల గురించి నిర్మాతలు చేసిన కామెంట్స్ ఆసక్తికరంగా మారాయి.దర్శకుడు రాఘవ లారెన్స్ తెరకెక్కించిన ఆ సినిమాలో ప్రభాస్ సరసన తమన్నా, దీక్షా సేథ్ హీరోయిన్లుగా నటించారు. రెబల్ స్టార్ కృష్ణంరాజు కీలక పాత్ర పోషించారు. 2012 సెప్టెంబర్ 28న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆ చిత్రం ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. అప్పట్లో భారీ బడ్జెట్ తో రూపొందిన ఆ సినిమా.. వసూళ్ల పరంగా వెనుకబడటంతో ప్రభాస్ కెరీర్ లోని పెద్ద డిజాస్టర్లలో ఒకటిగా నిలిచింది.ఇటీవల రెబల్ నిర్మాతలు జే భగవాన్, జే పుల్లారావు సినిమా నిర్మాణ సమయంలో ఎదురైన కష్టాలు గుర్తు చేసుకున్నారు. వారు చెప్పిన విషయాలు చూస్తే, రెబల్ విడుదల కావడమే ఒక పెద్ద సవాల్ గా మారిందని అర్థమవుతోంది. సినిమాను ప్రారంభించినప్పుడు ఒక బడ్జెట్ అనుకుని ముందుకెళ్లామని, ఒప్పందాలు కూడా చేసుకున్నామని నిర్మాతలు తెలిపారు.కానీ షూటింగ్ సగం పూర్తయ్యే సమయానికి అనుకున్న మొత్తం ఖర్చు అయిపోయిందని వెల్లడించారు. ఇంకా సగం సినిమా చిత్రీకరించాల్సి ఉండటంతో పరిస్థితి మారిందని చెప్పారు. సినిమా పూర్తయ్యే సమయానికి ఖర్చు దాదాపు డబుల్ అయ్యిందని వారు పేర్కొన్నారు. దీంతో ఇండస్ట్రీలో కూడా మూవీ కంప్లీట్ అవుతుందా? విడుదల అవుతుందా? అనే సందేహాలు వ్యక్తమయ్యాయని గుర్తు చేశారు.నిర్మాతలుగా తమకు అప్పటికే నష్టం తప్పదనే విషయం అర్థమైందని, అయినప్పటికీ వెనక్కి తగ్గలేదని చెప్పారు. ఆ మొత్తం జర్నీలో ప్రభాస్ హెల్ప్ ను నిర్మాతలు ప్రత్యేకంగా ప్రస్తావించారు. సినిమా విడుదలయ్యే వరకు ఆయన పూర్తిగా అండగా నిలిచారని తెలిపారు. కష్టకాలంలో హీరో సహకారం తమకు ఎంతో ధైర్యం ఇచ్చిందని పేర్కొన్నారు. ఆ పరిస్థితుల్లో ప్రభాస్ మద్దతు లేకపోయి ఉంటే సినిమా మధ్యలో ఆగిపోయేదేమో అన్న భావన వారి మాటల్లో కనిపించింది.

అదే సమయంలో దర్శకుడు రాఘవ లారెన్స్ పనితీరుపై నిర్మాతలు స్పందించారు. ఆయన తనకు కావాల్సిన విషయంలో రాజీపడే వ్యక్తి కాదని చెప్పారు. సినిమా క్వాలిటీ విషయంలో ఎలాంటి తగ్గింపులు అంగీకరించరని తెలిపారు. అయితే బడ్జెట్ పరంగా అది నిర్మాతలకు భారంగా మారిందని వెల్లడించారు. అయినా సరే, మొదటి రోజు ముహూర్తం సమయంలో ఎంత ఉత్సాహంగా ఉన్నామో, చివరి వరకు అలాగే సినిమాను పూర్తి చేసి ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చామని చెప్పారు.

రిజల్ట్ నిరాశపరిచినా, నిర్మాతలుగా తమ బాధ్యత నుంచి వెనక్కి తగ్గలేదని స్పష్టం చేశారు. ఇప్పటివరకు రెబల్ గురించి అభిమానులు మాట్లాడుకునేది కేవలం దాని రిజల్ట్ గురించే. కానీ నిర్మాతల లేటెస్ట్ కామెంట్స్ చూస్తే, ఆ సినిమా వెనుక ఎన్నో ఫైనాన్షియల్ స్ట్రగుల్స్ దాగి ఉన్నాయని తెలుస్తోంది. ముఖ్యంగా ప్రభాస్ కోపరేషన్ లేకపోయి ఉంటే రెబల్ రిలీజ్ కాకుండా, మధ్యలో షెడ్డుకెళ్లిపోయేదన్న చర్చ జరుగుతోంది.



# తన పేరుతో సైబర్ మోసాలు.. నకిలీ నంబర్‌ను షేర్ చేస్తూ అభిమానులను హెచ్చరించిన హీరోయిన్ మీనాక్షి చౌదరి!

'లక్కీ భాస్కర్' సినిమా ఘనవిజయంతో టాలీవుడ్‌లో మంచి క్రేజ్ సంపాదించుకున్న కథానాయిక మీనాక్షి చౌదరి తాజాగా ఒక పెద్ద సైబర్ మోసంపై స్పందించారు. తన పేరుతో కొందరు కేటుగాళ్లు ప్రజలను, అభిమానులను బురిడీ కొట్టించడానికి ప్రయత్నిస్తున్నట్లు ఆమె గుర్తించారు. తనలా నటిస్తూ మోసాలకు పాల్పడుతున్న ఒక గుర్తుతెలియని వ్యక్తి వ్యవహారాన్ని సోషల్ మీడియా వేదికగా బయటపెడుతూ ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సదరు నకిలీ వ్యక్తి వాడుతున్న ఫోన్ నంబర్‌ను స్క్రీన్ షాట్ తీసి తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో మీనాక్షి పోస్ట్ చేశారు. ఈ నంబర్ నుండి ఎవరికైనా మెసేజ్‌లు లేదా ఫోన్ కాల్స్ వస్తే నమ్మవద్దని, వెంటనే ఆ నంబర్‌ను బ్లాక్ చేసి రిపోర్ట్ చేయాలని కోరారు. అది తన నంబర్ కాదని స్పష్టం చేసిన ఆమె, ఈ మోసాన్ని సకాలంలో గుర్తించి తన దృష్టికి తీసుకువచ్చిన నెటిజన్లకు, అభిమానులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇక సినిమాల విషయానికి వస్తే, మీనాక్షి చౌదరి ప్రస్తుతం టాలీవుడ్‌లో వరుస క్రేజీ ప్రాజెక్ట్‌లతో ఫుల్ బిజీగా ఉన్నారు. అందులో ముఖ్యంగా అక్కినేని నాగచైతన్య కథానాయకుడిగా నటిస్తున్న 'వృషకర్మ' చిత్రంపై సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. కార్తీక్ దండు దర్శకత్వంలో మైథలాజికల్ థ్రిల్లర్ నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com